www.vishalabharati.com
epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
10 అక్టోబర్ 2023
సంపుటి:1 సంచిక:315

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## జనగామ అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లోకి..

- గులాబీ గూటికి టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల
- సీఎం సమక్షంలో చేరిక
- గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్






# ఓటు తలరాతను మార్చేస్తుంది..

- ఆపద మొక్కులు మొక్కేవారిని నమ్మొద్దు
- ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని అంటున్నారు
- 3గంటల కరెంట్ చాలనే కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలి
- రాజేశ్వర్ రెడ్డిని గెలిపిస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తా
- ముఖ్యమంత్రి కేసీఆర్

**విశాలభారతి స్టేట్ బ్యూరో:**

ఓటు మన తలరాతను మార్చేస్తుందని.. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి.. ఆపద మొక్కులు మొక్కే వారిని నమ్మొద్దని హితవు పలికారు. ధరణిని తీసేసి బంగాళాఖాతంలో వేస్తామని విపక్షాలు అంటున్నాయన్న ఆయన.. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలనే కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలని ధ్వజమెత్తారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపిస్తే.. చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీతో పాటు నర్సింగ్, పారా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ ఏర్పాటుకు ముందు కొన్ని జిల్లాలకు వెళ్తే తనకు ఏడుపొచ్చేదని.. జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల పరిస్థితి చూస్తే దీనంగా ఉండేదని కేసీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో బచ్చన్నపేటకు వెళ్తే.. ఊరిలోని యువకులంతా పొట్ట చేతపట్టుకుని వలస వెళ్లారని తెలిసిందన్నారు. ఇప్పుడు బచ్చన్నపేట చెరువులో 365 రోజులూ నీళ్లు ఉంటున్నాయన్న కేసీఆర్.. జనగామ జిల్లాలో ఇక కరువు అనేదే కనిపించదని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో జనగామ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో మనది అగమ్య గోచర పరిస్థితని కేసీఆర్ పేర్కొన్నారు. ఆర్థిక నిపుణులను పిలిపించి.. రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. ఎంతో మేథోమథనం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించామన్నారు. రాష్ట్ర రైతులు ఇప్పుడిప్పుడే దారినపడ్డారన్న ఆయన.. రైతులకు తమ భూమిపై పూర్తి హక్కులు ఉండాలనే ధరణి తెచ్చామని వివరించారు. అన్నదాతల కష్టాలు తెలుసు కాబట్టే రెవెన్యూ అధికారుల అధికారాలు రైతు చేతిలో పెట్టానన్నారు. రైతు వేలిముద్ర లేకుండా భూమి జోలికి ఎవరూ పోలేరని చెప్పారు. ధరణిని తీసేసి బంగాళాఖాతంలో వేస్తామని విపక్షాలు అంటున్నాయని పేర్కొన్న కేసీఆర్.. రైతుల మీద అధికారులను మళ్లీ రుద్దాలని చూస్తున్నాయని ఆరోపించారు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని కాంగ్రెస్ నేతలు అంటున్నారని.. సాగుకు 3 గంటల కరెంట్ చాలంటున్న కాంగ్రెస్‌ను

..మిగతా 2 లో





# కారు బేకారు అయిపోయింది

- 'చేయి' ప్రజలకు చెయ్యిచ్చింది
- యువతకు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి
- తెలంగాణాలో అభివృద్ధి కనిపించడం లేదూ
- తెలంగాణ రాణీ రుద్రమ, కుమురం భీం పుట్టినగడ్డ
- బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

> సీఎం కేసీఆర్ కుటుంబ అవినీతిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు. కుటుంబ పాలనను తెలంగాణ ప్రజలు అంగీకరించే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వనందుకు కేసీఆర్ వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే కారు బేకారు అయిపోయిందని.. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

**విశాలభారతి స్టేట్ బ్యూరో:**

గత కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నానని.. ఇక్కడి ప్రజలను చూస్తుంటే రాజకీయ చైతన్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. రాణీ రుద్రమ, కుమురం భీం పుట్టినగడ్డ తెలంగాణ అని కొనియాడారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రెండు స్థానాలు గెలిస్తే ఒకటి గుజరాత్ నుంచి.. రెండోది తెలంగాణ నుంచి గెలిచామని కేంద్రమంత్రి గుర్తు చేశారు. గత 27 ఏళ్లుగా గుజరాత్ ఎలా అభివృద్ధి చెందుతుందో ప్రజలంతా చూస్తున్నారన్నారు. కేవలం గుజరాత్ మాత్రమే కాకుండా దేశమంతా అభివృద్ధి చెందుతుంటే.. తెలంగాణాలో మాత్రం అభివృద్ధి కనిపించడం లేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన గర్జన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 2014లో ప్రజల ఒత్తిడికి తలొగ్గి.. కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాల్సి వచ్చిందని రాజ్‌నాథ్‌సింగ్

..మిగతా 2 లో



# సీనియర్లు అసంతృప్తి

- టికెట్లు ఖరారు కాకపోవడంతో మధుయాష్కీ ఇంట్లో భేటీ
- అధిష్టానాన్ని కలవాలని నిర్ణయం
- ఖర్గే, సోనియా, రాహుల్ అపాయింట్మెంట్ కోసం ప్రయత్నం
- రాహుల్ రాష్ట్ర పర్యటనకు రాకముందే ఢిల్లీలో కలువాలని నిర్ణయం
- రెండో జాబితాపై ఉత్కంఠ

**విశాలభారతి,తెలంగాణ బ్యూరో :**

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీలు ఆ పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ ఇంట్లో కీలక సమావేశం నిర్వహించారు. తొలి విడుతలో పార్టీలో టికెట్ దక్కని మాజీ ఎంపీలు సురేష్ షట్కర్, పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, మధుయాష్కీ ఇంట్లో భేటీ అయ్యారు. సీనియర్లుగా ఉన్న తమకు తొలి జాబితాలో టికెట్ ఖరారు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయించారు. పార్టీ కోసం పని చేసిన సీనియర్లకు టికెట్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతున్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ లో ఎన్నికల పంచాయితీలు పెరుగుతున్నాయి. కాంగ్రెస్ 55 మంది అభ్యర్థుల జాబితా ప్రకటించింది. అందులో సీట్లు ఆశించిన వారు టికెట్లు దక్కక నిరసనలకు దిగుతున్నారు. ఇదే సమయంలో మాజీ ఎంపీలు సైతం సీట్లు ఆశించారు. తుది జాబితా

..మిగతా 2 లో

# అధిష్టానం అన్ని ఆలోచించే టిక్కెట్లు కేటాయింపు





- డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం
- ఎల్బీ నగర్ లో ప్రమాణాస్వీకారోత్సవం
- అదే రోజు గ్యారంటీలపై తొలి సంతకం
- ప్రవళికపై ఆత్మహత్య పై కేటీఆర్ అభాండాలు
- పదేళ్లవుతోన్న బీఆర్ఎస్ జిల్లాలో కరువును ఆపలేదు
- వికారాబాద్ నుండి కాంగ్రెస్ ప్రచారం ప్రారంభోత్సంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

# అజ్ఞాతం వీడిన వట్టే జానయ్య

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో కలిసి భారీ ర్యాలీ
- జై భీమ్ నినాదాలతో హోరెత్తిన సూర్యాపేట
- బిఎస్పి తీర్థం పుచ్చుకున్న జానయ్య యాదవ్
- కదం తొక్కిన కళాకారులు

జన సంద్రంగా జిల్లా కేంద్రం

**సూర్యాపేట,విశాలభారతి:**

గత 50 రోజుల నుండి అజ్ఞాతంలో ఉన్న వట్టే జానయ్య యాదవ్ సోమవారం రోజు సూర్యాపేటకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో కలిసి జిల్లా కేంద్రంకు చేరుకొని సూర్యాపేట లో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత జనం రావడంతో నాయకులు, బిఎస్పీ కార్యకర్తలు ఆనంద ఉత్సవాలతో జానయ్య యాదవ్ కు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఘన స్వాగతం పలికారు.అనంతరం



..మిగతా 2 లో






# కేటీఆర్ అసత్య ప్రచారం

- ప్రవళిక గ్రూప్స్ కి అప్లై చెయ్యలేదన్న మంత్రి
- ఆమె హల్ టికెట్స్ ను వైరల్ చేసిన నిరుద్యోగులు
- కేటీఆర్ అపద్ధాలు మానుకో అని విమర్శలు

**విశాలభారతి, తెలంగాణ బ్యూరో :**

గ్రూప్ 2 అభ్యర్థిని ప్రవళిక మృతి విషయంలో పోలీసులు హైడ్రామా నడిపారు. ప్రేమ విఫలం కావడంతోనే ప్రవళిక చనిపోయిందని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రవళిక అసలు గ్రూప్స్ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేయలేదని చెప్పుకొచ్చారు. వాస్తవానికి గ్రూప్ 1, 2, 3, 4 లకు ప్రవళిక దరఖాస్తు చేసుకుంది. తాజాగా ఈ విషయాలు గ్రూప్స్ అప్లికేషన్స్ వెలుగులోకి వచ్చాయి. ప్రవళిక విషయంలో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. పరీక్షలు వాయిదా పడడంతోనే ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. విషయాన్ని పక్కదారి పట్టకుండా చేయడానికి పోలీసులు హైడ్రామా ఆడారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రవళిక మృతిపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు దుమారం లేపాయి . అసలు ప్రవళిక ఇప్పటివరకు ఎలాంటి పోటీ పరీక్ష రాయలేదని , కోచింగ్ కోసం 15 రోజుల క్రితం హైదరాబాద్ లోని అశోక్ నగర్ కు వచ్చిందని మంత్రి కేటీఆర్ మాట్లాడారు.. దీంతో నిరుద్యోగులు మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవళిక గ్రూప్ 1,2,3,4 ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన పేపర్స్ ను ట్విట్టర్ లో పోస్టు చేశారు. మంత్రి కేటీఆర్ గారు ఇదిగో ప్రూఫ్ అని పేర్కొన్నారు. ప్రవళిక ఆత్మహత్యకు ప్రేమే కారణమంటూ అపనిందలను పోలీసులు మోపుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించకుండా మంత్రి కేటీఆర్ పోలీసుల మాదిరిగా మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని నిరుద్యోగులు సీరియస్

..మిగతా 2 లో



# కారు బేకారు అయిపోయింది

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత.. ఎలా అభివృద్ధి చెందుతున్నాయో ప్రజలు పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ ఒక లిమిటెడ్ కంపెనీలా.. ఒక కుటుంబ అభివృద్ధికి మాత్రమే దోహదపడుతోందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబ అవినీతిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. కుటుంబ పాలనను తెలంగాణ ప్రజలు అంగీకరించే పరిస్థితిలో లేరన్న రాజ్‌నాథ్‌సింగ్.. యువతకు ఉద్యోగాలు ఇవ్వనందుకు కేసీఆర్ వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడు ఎకరాల భూమి, దళితబంధు ఎంత మందికి ఇచ్చారో ప్రజలు ఆలోచించాలన్నారు.

ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునే పార్టీ బీజేపీ అని కేంద్రమంత్రి పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిరం కడతామని చెప్పి కట్టామన్నారు. జమ్మూ కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేస్తామని చెప్పి చేశామని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా భూ రికార్డులు డిజిటలైజ్ చేసి.. పారదర్శకంగా సమాచారం అందించడమే కాకుండా రుణ సౌకర్యం పొందే సదుపాయం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి తెలంగాణలోనూ జరగాలంటే ఈసారి తమ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలోనే కారు బేకారు అయిపోయింది.. చేయి ప్రజలకు చెయ్యిచ్చిందని విమర్శించారు. మీ ఇళ్లకు లక్ష్మి ఎవరిదో చేయి పట్టుకొని రాదని.. కమలం పూవుపై కూర్చొని వస్తుందని గమనించాలని రాజ్‌నాథ్‌సింగ్ కోరారు.

దేశమంతా అభివృద్ధి చెందుతుంటే.. తెలంగాణలో మాత్రం అభివృద్ధి జరగడం లేదు. తెలంగాణ ఒక లిమిటెడ్ కంపెనీలా.. ఒక కుటుంబ అభివృద్ధికి మాత్రమే దోహదపడుతోంది. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి ఇక్కడ కూడా జరగాలంటే మీ సహకారం మాకు అవసరం. కారు బేకారు అయిపోయింది. చేయి ప్రజలకు చెయ్యిచ్చింది. ఈసారి మాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండని అన్నారు.

# ఓటు తలరాతను మార్చేస్తుంది..

మొదటిపేజీ తరువాయి

బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిస్తే.. 93 లక్షల మందికి కేసీఆర్ బీమా అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. రైతుబీమా తరహాలోనే వ్యక్తి చనిపోతే వారంలోనే రూ.5 లక్షలు వస్తాయని తెలిపారు. ఈ క్రమంలోనే ఓటు మన తలరాతను మార్చేస్తుందని.. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. మళ్లీ గెలవగానే రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తామని.. ఎన్నికలప్పుడు వచ్చి ఆపద మొక్కులు మొక్కేవారిని నమ్మొద్దని హితవు పలికారు.

ఓటు మన తలరాతను మార్చేస్తుంది. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎంతో బలమైన ఆయుధం మన ఓటు. ఎన్నికలప్పుడు వచ్చి ఆపద మొక్కులు మొక్కేవారిని నమ్మొద్దు. ధరణిని తీసేసి బంగాళాఖాతంలో వేస్తామని విపక్షాలు అంటున్నాయి. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. సాగుకు 3 గంటల కరెంట్ చాలంటున్న కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలి. బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే.. 93 లక్షల మందికి కేసీఆర్ బీమా అమలు చేస్తాం. మళ్లీ గెలవగానే రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తామన్నారు.

# కేటీఆర్ అసత్య ప్రచారం

మొదటిపేజీ తరువాయి

అవుతున్నారు. ప్రవళిక ఆత్మహత్య పరిణామాలపై వాస్తవాలను ధ్రువీకరించుకోకుండా మంత్రి కేటీఆర్ విపక్షాలపై ఆరోపణలు చేయడం పద్ధతికాదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ నిరుద్యోగులు రోడ్లు ఎక్కడం వంటి అంశాలను పక్కదారి పట్టించేందుకే మంత్రి కేటీఆర్ ప్రతిపక్షాలపై విరుచుకుపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇదిలా వుండగా, ప్రవళిక పరువు తీసేందుకే పోలీస్ వ్యవస్థతో ప్రభుత్వం అబద్ధాలను చెప్పించిందని బీజేపీ ఎంపి డాక్టర్ కె. లక్ష్మణ్ దుయ్యబట్టారు. ప్రవళిక ఆత్మహత్యకు వేరే కారణం ఉందంటూ పోలీసు స్టేట్ మెంట్ లను చూసి నిరుద్యోగులు ఆశ్చర్యపోతున్నారని అన్నారు. కేసీఆర్ సర్కార్ చేతకానితనం కప్పిపుచ్చుకోవడానికి చనిపోయిన అమాయక అమ్మాయి మీద నెపం నెట్టడం మరింత దారుణమన్నారు.

# బీఆర్ఎస్ మీడియా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు రావొద్దు

- **నమస్తే తెలంగాణ, టీ న్యూస్, తెలంగాణ టుడే కు కాంగ్రెస్ బ్యాన్**
- **అవి బీఆర్ఎస్ జేబు సంస్థలు అంటూ ఫైర్**
- **తమ కార్యాలయాలకు రావొద్దని సూచన**
- **ప్రకటించిన వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్**



హైదరాబాద్,విశాలభారతి:

నమస్తే తెలంగాణ, టీ న్యూస్, తెలంగాణ టుడే మీడియా సంస్థలను కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది.తమ పార్టీ కార్యకలపాలకు ,మీటింగ్‌లు, కార్యాలయాలకు ఈ సంస్థల నుంచి జర్నలిస్టులు కూడా రావొద్దని కాంగ్రెస్ నొక్కి చెప్పింది. ఈ మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ సోమవారం ఓ ప్రత్యేక ప్రకటనను రిలీజ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ జేబు సంస్థలుగా వ్యవహరిస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేసీఆర్, ఆయన పార్టీకి అనుకూలంగా ఉంటూ కాంగ్రెస్ పై విషపూరిత వార్తలు రాస్తూ, తప్పుడు కథనాలను సృష్టించి జనాలను కన్ఫ్యూజ్ చేస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ జేబు సంస్థలుగా ఉన్న ఈ టీవీల్లో కూడా కుట్రపూరితమైన వార్తలు ప్రసారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆయా సంస్థల ప్రతినిధులకు కాంగ్రెస్ పత్రిక సమావేశాలకు ఆహ్వానం లేదన్నారు. ఇక నుంచి ఆ సంస్థల నుంచి వచ్చే స్టాఫ్ను కూడా జర్నలిస్టులుగా గుర్తించడం లేదని ఆయన విమర్శించారు. ఆహ్వానం లేకపోయినా మీటింగ్ లకు వస్తే మొహమాటం లేకుండా అడ్డుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు.

# అధిష్టానం అన్ని ఆలోచించే టిక్కెట్లు కేటాయింపు

విశాలభారతి,తెలంగాణ బ్యూరో :

అధిష్టానం అన్ని రకాలుగా ఆలోచించే గెలుపు గుర్రాలకు టిక్కెట్లు కేటాయింపు చేసిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ ప్రచారం ప్రారంభోత్సంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 9న తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటుకాబోతోందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.అదే రోజు ఎల్బీ నగర్ స్టేడియంలో జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై తొలి సంతకం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోపే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని అభయమిచ్చారు. కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం వికారాబాద్ నుండి ప్రారంభించిన రేవంత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ విజయదుంధుబి మోగిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ హుస్నాబాద్ నుండి బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రారంభిస్తే.. తాను వికారాబాద్ గడ్డ నుండి

ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఆయన తనకు హుస్నాబాద్ కలిసి వస్తుందని చెబుతున్నారు. కానీ నాకు వికారాబాదే కలిసివస్తుందన్నారు. అందుకే ఇక్కడ్నుంచే ప్రచారపర్వానికి నాంది పలికానని చెప్పారు. కేసీఆర్ సభలో కిరాయి మనుషులుంటే.. తన సభలో నిక్కార్సాయిన కార్యకర్తలు ఉన్నారన్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగి, కొడంగల్, జహీరాబాద్, తాండూరు, వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను



గెలిపించుకోవడం ద్వారా తమ బంగారు భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో పరిగిలో కాంగ్రెస్ ఓటమికి కమతం రాంరెడ్డి కుటుంబాన్ని కారణమైందన్న రేవంత్.. ఈ సారి ఆయన కుమారుడు శ్రీనివాస్ రెడ్డి నిపార్టీలో చేర్పించుకున్నామన్నారు. పార్టీ అధికారంలో లేకున్నా పార్టీని కాపాడుకున్న రామ్మోహన్ రెడ్డికి టిక్కెట్టు ఇచ్చామన్నారు. ఇటు తాండూరులో కాంగ్రెస్ గెలవాలని మనోహర్ రెడ్డిని పార్టీలో చేర్పించుకున్నామన్నారు.

2018లో వికారాబాద్ నుండి పోటీ చేసిన గడ్డం ప్రసాద్ ఓటమికి తనతో పాటు డాక్టర్ చంద్రశేఖర్ కూడా కారణమయ్యారన్నారు. ప్రచారానికి రాకుండా తాను పరోక్షంగా తప్పు చేస్తే.. ఆయనపై పోటీ చేసి చంద్రశేఖర్ తప్పు చేశారన్నారు. అందుకే ఆ తప్పిదం మళ్లీ జరగొద్దని.. అధిష్టానంతో మాట్లాడాకే చంద్ర శేఖర్ ను ఒప్పించి ఆయన్ను జహీరాబాద్ టికెట్ ఇచ్చామన్నారు. అధిష్టానం అన్ని రకాలుగా ఆలోచించే గెలిచే వారికే టిక్కెట్లు కేటాయించిందని రేవంత్ పునరుద్ఘాటించారు.

ప్రాణహిత చేవెళ్లతో ఈ ప్రాంత రైతాంగం కష్టాలు తీర్చాలని కాంగ్రెస్ భావించిందని రేవంత్ రెడ్డి చెప్పారు. గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయాలని ఉద్దేశ్యంతో ప్రాణహిత చేవెళ్ల ( బీఆర్ అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టు)లో లేని చేవెళ్లను ఇక్కడి వరకు పొడిగించి చేర్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు కోసం అప్పట్లో రూ. 11 వేల కోట్లు కూడా ఖర్చు చేసిందన్నారు. తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. పదేళ్లవుతోన్న ఇంత వరకు ఈ ప్రాంత కరువు రూపుమారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శంకర్పల్లి, చేవెళ్ల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాడనే ఆశతో గత ఎన్నికల్లో ఇక్కడ్నుంచి అధికార పార్టీ వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే చుక్క నీరు కూడా అందించలేదని మండిపడ్డారు. కనీసం పాలమూరు = రంగారెడ్డి ప్రాజెక్టుతో ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు అందిస్తుందని భావిస్తే అదీ నెరవేరలేదన్నారు. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు తరలించేందుకు అప్పట్లో రామ్మోహన్ రెడ్డి సర్వే కోసం రూ. 7 కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. శాటిలైట్ సిటీని హైదరాబాద్ నుండి వికారాబాద్ వరకు పొడగించేలా.. మెట్రో రైలు వచ్చేలా అప్పట్లో మాజీ మంత్రి జైపాల్ రెడ్డి రూ. 2003 కోట్లు కేటాయిస్తే ఆ ఊసేలేదన్నారు. స్వయంగా సొంత పార్టీ నాయకురాలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ సునితా మహేందర్ రెడ్డి కారు మీద రాళ్ల దాడి చేసిన ఘనత బీఆర్ఎస్ నేతలకే దక్కిందన్నారు. గతంలో లేని సంస్కృతి వికారాబాద్ లో కనబడుతోందన్నారు. గ్రూప్ 2 ఉద్యోగం కోసం ఎదురుచూసి తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు చూడలేక ఆత్మహత్య చేసుకున్న ప్రవళికపై కేటీఆర్ అబాంఢాలు వేస్తున్నారని మండిపడ్డారు. మృతురాలిపై నిందలు మోపే ముందు తన చెల్లి కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

# సీనియర్లు అసంతృప్తి

మొదటిపేజీ తరువాయి

కోసం నిరీక్షిస్తూనే ముందు పరిణామాలను గమనిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీలకు ఎమ్మెల్యేలుగా సీట్లు ఇచ్చి తమను పట్టించుకోకపోవటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అందులో ప్రధానంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ ను టార్గెట్ చేస్తున్నారు. మాజీ ఎంపీలు పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ నివాసంలో భేటీ అయ్యారు. తమకు ఎవరికీ సీట్లు రాకపోవటం పైన చర్చించారు. తుది జాబితాలో అవకాశం ఉంటుందేమో వేచి చూద్దామనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే, తుది జాబితా ప్రకటించిన తరువాత చేసేది ఏమీ ఉండదనే అభిప్రాయం నేల మధ్య వ్యక్తం అయింది. ఇందులో యాష్కీ ఈ సారి ఎల్బీ నగర్ నుంచి సీటు ఆశించారు. మిగిలిన వారిలో బలరాం నాయక్ మహబూబాబాద్, పొన్నం హుస్నాబాద్, కానీ, వీరిలో ఎవరికీ తొలి జాబితాలో సీటు దక్కలేదు. సిట్టింగ్ ఎంపీలకు సీట్లు ఖరారు చేసి తమకు కేటాయించకపోవటం పై వీరంతా ఆగ్రహంతో ఉన్నారు. దీంతో, వీరు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ వెళ్లి పార్టీ నాయకత్వంతో సమావేశం కావాలని నిర్ణయించారు. తొలి జాబితాలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కు ముషీరాబాద్ సీటు కేటాయించారు. ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్తో పాటు ఖర్గేను కలిసి సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారు. రాహుల్ గాంధీ పర్యటనకు ముందే ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

# అజ్ఞాతం వీడిన వట్టే జానయ్య

మొదటిపేజీ తరువాయి

జిల్లా కేంద్రంలో బిఎస్పి ఆఫీసులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జానయ్య యాదవ్ మాట్లాడారు. 50రోజుల పోరాటంలో మా కుటుంబానికి అండగా ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సూర్యాపేట 70ఏండ్ల చరిత్రలో ఒకే ఒక్క సారి బీసీ బిడ్డ ధర్మం బిక్షం మాత్రమే ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. అగ్రవర్ణాల కుట్రలలో నియోజక వర్గంలో పోటీ చేయకుండా ఎన్నో కుట్రలు చేశారని ఆరోపించారు. సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు ఏ పార్టీ నుండి అగ్రవర్ణ నాయకులు వచ్చిన కడుపులో పెట్టుకొని గెలిపించారని తెలిపారు. 2014 నుండి సూర్యాపేటకు సంబంధం లేని వ్యక్తి కనీసం వార్డ్ మెంబర్ కూడా గెలవలేని వ్యక్తి ని గెలిపించుకున్న ఘనత సూర్యాపేటదని,2018లో ఆయన గెలుపు కోసం నేను చేసిన పాత్ర ఏందో అందరికి తెలుసు ,అర్ధరాత్రి గెలుపు కోసం కన్నీరు పెట్టుకున్న చరిత్ర ఆయనదని అన్నారు.బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన వారికి చైర్మన్ పదవి ఇస్తామని డబ్బులు తీసుకున్నది నిజం కాదా!

**నన్ను, నా భార్యను చైర్మన్ చేస్తామని డబ్బులు తీసుకున్నది నిజం కాదా!**

తీసుకున్న డబ్బులకు బాధ్యత తీసుకోవాలని అడిగినందుకు నాకు ఈ రోజు ఈ గతి పట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వందలాది కాంట్రాక్టర్ల కడుపు కొట్టి ఒకే వ్యక్తికి కాంట్రాక్టులు ఇచ్చి కోట్లు వెనుక వేసుకున్నది నిజం కాదా.. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, రోడ్ల అభివృద్ధి ముసుగులో ఎన్ని కోట్లు వెనకేసుకు వచ్చింది, మెడికల్ కాలేజ్ మాస్టర్ ప్లాన్ మార్చి కోట్లు సంపాదించారని ఆరోపించారు.

సూర్యాపేటలో బుద్ధి చెప్పే రోజులు వచ్చాయని, కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం రోడ్ల మీద వ్యాపారం చేసుకోకుండా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కట్టారని విమర్శించారు. 2014 ముందు 200 ఖర్చు పెట్టలేని మంత్రి నేడు వేల కోట్లు ఎట్లా సంపాదించారో శ్వేతా పత్రం విడుదల చేయాలని, నాగారం బంగ్లా చుట్టూ కబ్జా చేసిన భూములు, కలెక్టరేట్ పేరుతో పేద రైతుల నుండి భూములను గుంజుకొని భూముల రేట్లు పెంచారని ఆరోపించారు. అసైన్డ్ భూములని మిషన్ భగీరథ పేరుతో పేదల పేరిట భూములు గుంజుకున్నారని, వందల ఎకరాల భూములు ఉన్న ఆసముల దగ్గర ఎందుకు భూములు గుంజుకోలేదో..ఉద్యమ సమయంలో ఉన్న నాయకులను ఇప్పుడు ఎక్కడ ఉన్నారు అని ప్రశ్నించారు.

మున్సిపల్ చైర్ పర్సన్ ఇస్తా అని గండూరి ప్రకాష్ తో పాటు చాలా మందిని మోసం చేశారని,
సంతకాలు మున్సిపల్ చైర్ పర్సన్ వి కమిషన్లు మంత్రికి సూర్యాపేట ప్రజల ఇబ్బందులపై పిపీలతో మాట్లాడిన రికార్డులు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బయట పెడుతానని ,
కోటి సుఫారీ ఇచ్చిన వ్యక్తితోనే నాపై తప్పుడు కేసులు పెట్టించాడని,అధికారం దుర్వినియోగానికి పాటుపడుతున్న అధికారులను తీసి వేసి అడ్డుకట్ట వేయాలని అన్నారు.లేనిపక్షంలో కోర్టులను ఆశ్రయించడానికి వెనుకాడ బోమని అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులను తమ వ్యవహార శైలిని మార్చుకోవాలని, బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా పనిచేస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయనే పేదలను భయభ్రాంతులకు గురి చేయడం బీఆర్ఎస్ అభ్యర్థులు మానుకోవాలని, అగ్రకుల నాయకత్వంలో పనిచేసే బహుజనులు ఇప్పటికైనా స్వతాగా బయటకు రండి బీసీల ఆత్మగౌరవాన్ని బలి చేయవద్దు,రాబోయేది బహుజన రాజ్యమేనని గుర్తుంచుకోవాలని కోరారు. పత్రికా యాజమాన్యాలు అధికార పార్టీకి బందీలయ్యాయని, అధికారం అనేది ఎవరికి శాశ్వతం కాదని, సాధారణ జర్నలిస్టు పక్షాన యాజమాన్యాలు నిలబడాలని విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట నియోజకవర్గ అభ్యర్థిగా నిలబడునున్న వట్టే జానయ్య యాదవును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించి, అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఒకే రోజులోనే 74 కేసులు పెట్టి జానయ్య యాదవ్ పై పెట్టించడంతోపాటు ఆ కేసులను సూర్యాపేట జిల్లా కోర్టులో ఎవరు వాదించోద్దని బార్ కౌన్సిల్ కు హుకుం జారీ చేయడం మంత్రి జగదీష్ రెడ్డి నీచ రాజకీయ చరిత్రకు నిదర్శనమని అన్నారు .ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వట్టే రేణుక, ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బుడిగ మల్లేష్ యాదవ్, కొండ భీమయ్య, చెడపంగు రవికుమార్, రాపోలు నవీన్ కుమార్, దేశ గాని సాంబశివ గౌడ్, వెంపడి నాగమణి, దాసరి శీను, పెదమర్తి ఉపేందర్, చాంద్ పాషా, నీలాబాయి లింగా నాయక్, నకిరేకంటి వెంకన్న, మేడి ప్రియదర్శిని, ఆవుదొడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- **టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి జర్నలిస్టుల అధ్యయన వేదిక వినతి**

**విశాల భారతి, హైదరాబాద్:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పీసీసీ చీఫ్ ఎ. రేవంత్ రెడ్డిని తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక నాయకులు కోరారు. సోమవారం జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ లోని రేవంత్‌రెడ్డిఆ నివాసంలో ఆయనను కలిసి తెలంగాణ జర్నలిస్టుల సమస్యలు వివరించి, సంక్షేమానికి సంబంధించి 9 ప్రధాన అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వాటిని పొందుపరిచి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రేవంత్ రెడ్డి తగు పరిశీలన చేసి మేనిఫెస్టోలో పెడతామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక అధ్యక్షుడు బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్ రావు, జె. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సాధిక్, సహాయ కార్యదర్శి మధు, కార్యదర్శి, ట్రెజరర్ వేల్పుల సురేశ్ ఉన్నారు.



# టీడీపీ 30 మందితో ఫస్ట్ లిస్టు

- **మరో 87మంది పై సర్వే**
- **టిడిపి జనసేన కలిసి పోటీ**
- **మేనిపెస్టో సిద్ధం చేశాం**
- **ప్రచారంలో బాలకృష్ణ పాల్గొంటారు**
- **పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్**

హైదరాబాద్,విశాలభారతి:

శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ప్రకటన, వరుస బహిరంగ సభలతో దూసుకుపోతున్నాయి. రాష్ట్ర విభజనతో తెలంగాణలో ఉనికి కోల్పోయిన టీడీపీ కూడా తమ ఎమ్మెల్యే అభ్యర్థుల లిస్ట్ రెఢీ చేసింది. సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ కంటే టిడిపి బలంగా ఉందని.. ఇప్పటికే 30 మంది అభ్యర్థులతో లిస్టు రెడీగా ఉందని.. మరో 87 మంది పై సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు హైదరాబాద్,ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇతర పార్టీల నుండి.. టిడిపి లోకి వచ్చేందుకు చాలామంది నేతలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ (జనసేన)..పొత్తుకు వస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగంలో ఉంటుంది ...దీటుగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం అని స్పష్టం చేశారు. పోటీచేస్తున్న క్యాడెంట్స్ పేర్లను వెల్లడిస్తానని.. అప్పటి వరకు వెయిట్ చేయండి అని సూచించారు. తప్పుడు ప్రచారం నమ్మొద్దు అని కోరారు. చంద్రబాబును శనివారం రాజమండ్రి జైలలో భేటీ అయినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు పై అక్రమ అరెస్టు.....తప్పుడు కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వరకు కేసు పూర్తి అవుతుంది..బాబు బయటకు వస్తాడు..నమ్మకం ఉందన్నారు. తెలుగుదేశం మేనిఫెస్టో కూడా సిద్ధంగా ఉంది..చంద్రబాబు ఆలోచన బీసీలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. క్యాండేట్స్ పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని 87 మందిని చెక్ చేస్తున్నాం..టీడీపీ నాయకుల లిస్టు రెడీగా ఉంది.. చంద్రబాబు నాయుడు ముందు పెట్టీ బయటకు.. లిస్టును వెల్లడిస్తాం అని స్పష్టం చేశారు.

గ్రేటర్ లో కాకుండా...తెలంగాణ జిల్లాల్లో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు బాలకృష్ణ ప్రచారానికి వాస్తారన్నారు. 14 సంవత్సరాల సీఎం..9ఏళ్లు ఉమ్మడి రాష్ట్రం లో ముఖ్యమంత్రిగా పనిచేసిన గొప్ప నాయకుడు చంద్రబాబు అన్ని అర్హతలు టీడీపికే ఉన్నాయి.. మేం పామ్ లోకి వస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. టిడిపిమేనిఫెస్టో కార్యకర్తలకు యువతరానికి... ఆదర్శ ప్రాయంగా ఉంటుంది అని స్పష్టం చేశారు.






## జోరు మీదున్న కాంగ్రెస్.. బోల్తా పడ్డ బీఆర్ఎస్

దళితులను మభ్య పెడుతున్న బీఆర్ఎస్

**మణుగూరు, విశాల భారతి:** పినపాక నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయి. ఏ పార్టీకి అంత ఈజీగా అధికారం దక్కే అవకాశాలు కనిపించడం లేదు. ఈ సారి టఫ్ ఫైట్ ఉంటుందని రాజకీయ మేధావులు చెబుతున్నారు. అయితే పినపాక నియోజకవర్గంలో జనం కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారు. ఎన్నికలకు మూడు నెలల ముందే బిఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. అధికార పార్టీలోని అలకలు అసమ్మతి వాతావరణాన్ని కాంగ్రెస్కు తమ అనుకూలంగా మార్చుకుంది. కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గంలో భారీగా చేరికలు పెంచుకొని ఆ పార్టీకి బలం పెంచుకుంది. అందుకే సర్వేలన్నీ కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో నిలిచి నట్లు కనిపిస్తోంది.

**పినపాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ పై ప్రజల్లో వ్యతిరేకత:**

బీఆర్ఎస్ అభ్యర్థులకు చాలా చోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నది. పినపాక నియోజక వర్గంలో రేగా కాంతారావుకి ప్రజల నుండి దళిత బందు, బీసీ బంధు, పోడు పట్టాల విషయంలో పూర్తి వ్యతిరేకత వస్తున్నది. పోడు పట్టాలు కేవలం గిరిజనులకేనని, గిరిజనేతరులకు ఇంత వరకు ఇలాంటి పట్టాలు ఇవ్వకపోవడంతో మీరేం చేశారని ఓట్ల కోసం వస్తున్నారు అంటూ నిలదీస్తున్నారు. తాజాగా బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టి నగర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు దాదాపు 1400 మంది రాజీనామాలు చేసి, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. ప్రభుత్వ పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలకు, ధనికులకే ఇస్తున్నారని పైగా కమిషన్ అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ కు దళిత బందు, బీ సీ బంధు, పేర్లు అధికార పార్టీ భవిష్యత్తుకి ఉరితాడు కానుందని,ఆదివారం నాడు కెసిఆర్ ప్రకటించిన మేనిఫెస్టోలో సామాన్య ప్రజానీకానికి నైతికాభివృద్ధి చెందేలాలేదని, నిరుద్యోగుల మాటే లేదని అన్ని మాయమాటలేనని ఇక బీ ఆర్ ఎస్ నీ నమ్మే పరిస్థితి లేదని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

**పినపాక నియోజకవర్గంలో పుంజుకున్న కాంగ్రెస్:**

తెలంగాణ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ ను ప్రజలు రెండుసార్లు తిరస్కరించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మొదటి జాబితాలో భద్రాచలం నియోజకవర్గం అభ్యర్థిగా పొదెం వీరయ్య పేరు ఖరారు చేయడంతో జిల్లాలో సంబరాలు మొదలయ్యాయి. రోజురోజుకీ పినపాక నియోజకవర్గంలో కొన్ని వేల మంది కాంగ్రెస్ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. దీంతో ప్రజలంతా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నారు.

పినపాక నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, డాక్టర్ చందా సంతోష్ కుమార్ పేరు దాదాపు ఖరారు అయినట్లేనని పినపాక నియోజకవర్గంలోని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన వెన్నంట ఉండే కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీ విజయాన్ని పునరావృతం చేయాలనే పట్టుదలతో పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు గ్యారెంటీలు, డిక్లరేషన్లు ప్రకటిస్తూ క్రమంగా కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గంలో గ్రాఫ్ పెంచుకున్నదని, నిరుద్యోగులు రైతులు మహిళలు వృద్ధులు సహా బిఆర్ఎస్ కు ఇన్నాళ్లు దగ్గరగా ఉన్న వర్గాలన్నింటిని ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ తనవైపు తిప్పుకున్నదని నియోజకవర్గంలో ప్రజల మాట. నియోజకవర్గంలో చందా సంతోష్ కుమార్ తనదైన శైలిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, ప్రజలకు న్యాయం చేయడంలో, చెరగని ముద్ర వేసుకుంటున్నారు. సంతోష్ కుమార్ కి రోజు రోజుకి ఫాలోయింగ్ పెరగడం చూసి నియోజకవర్గం అన్ని వర్గాల ప్రజలు సంతోష్ వైపే మొగ్గు చూపుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే రేగా దళిత బంధు జాబితాలో ఎక్కువగా ధనికులు, ప్రభుత్వ ఉద్యోగుల భార్యల పేర్లు ఉండడం, అలాగే నియోజకవర్గంలోని యువత పిజి వరకు చదువుకున్న వారికి దళిత బంధు ఇస్తానని చెప్పి నమ్మించి వారిని మభ్య పెట్టారని, ఇప్పుడు వారితోనే పబ్లిసిటీ పోస్టర్లు అంటించడం తో ఎమ్మెల్యే పై నమ్మకం కోల్పోయి ఇంత చదువు చదివి దీనికోసమేనా అని, యువత బీఅర్ఎస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. పినపాక నియోజకవర్గం లో ఎస్సీ లు దాదాపు 50 శాతంగా ఉన్నారని వాళ్లు తలుచుకుంటే అధికార పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని, దళితులను మోసం చేయడంలో బీఆర్ఎస్ పార్టీ ముందు వరుసలో ఉందని యువత భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో సంతోష్ కుమార్ ని అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించుకొని గుండెల్లో పెట్టుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.





# సీఎం కేసీఆర్ తో కలిసి నడుద్దాం

**రూ. 600కోట్లతో అభివృద్ధి చేశా మరోసారి ఆశీర్వదించండి**

**భువనగిరి టౌన్, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ సహకారంతో భువనగిరి నియోజకవర్గంలో రూ.600 కోట్లతో అభివృద్ధి చేశానని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకోవడానికి మనందరం సీఎం కేసీఆర్ తో కలిసి నడువడంతో పాటు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలందరీ ఆశీస్సులతో తనను మరోసారి అసెంబ్లీకి పంపించాలని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు బహిరంగ సభ వేదిక నుంచి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్డును అభివృద్ధి చేసుకోవడంతో పాటు భువనగిరి పెద్ద చెరువు, బీబీనగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్ గా సుందరీకరణ చేయడం జరిగిందన్నారు. భువనగిరి పట్టణంలో గత సంవత్సరం నుండి కిసాన్ నగర్ అర్బన్ కాలనీ రోడ్లు అభివృద్ధి చేసుకున్నామని వివరించారు. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఎలా ఉన్నదో మనందరికీ తెలుసని నేడు ఏవిధంగా అభివృద్ధి చేశామో మన కళ్ళకు కనిపిస్తుందని ఆయన వివరించారు. రానున్న కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టబోయే పథకాలు సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో విడుదల చేశారని ఆ పథకాలు ఒక సామాజిక విప్లవాన్ని తీసుకువస్తాయని అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రానికి అతి తొందర్లో డిగ్రీ కళాశాల, ఐటి హబ్ ఏర్పాటు చేయాలని, భువనగిరి వరకు మెట్రో రైలు పొడిగించాలని, నరసింహా రిజర్వాయర్ నిర్మాణ క్రమంలో భూమి కోల్పోయిన బాధితులందరికీ న్యాయం చేయాలని భువనగిరి పోచంపల్లి కేంద్రాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఈసందర్భంగా ఆయన సీఎం కేసీఆర్ నీ కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి గ్రంథాలయ చైర్మన్ అమరేందర్ రైతు సమన్వయ కన్వీనర్ అమరేందర్ , జడ్పిటిసి బీరు మల్లయ్య, ఎంపీపీ నిర్మల, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి, మండల అధ్యక్షులు జనగాం పాండు, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, బలుగురి మధుసూదన్ రెడ్డి, జక్కరాఘవేందర్ రెడ్డి, రాకల శ్రీనివాస్, ఓం ప్రకాష్ సర్పంచులు కౌన్సిలర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## కారు దిగి చేయి అందుకోనున్న మాజీ ఎమ్మెల్యే 'చౌలపల్లి'

**ఆయన వెంటే కారుదిగనున్న ఫరూక్ నగర్, కేశంపేట జడ్పీటీసీలు.**

**షాద్ నగర్,విశాలభారతి:** షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి కారు దిగి చేయి అందుకోనున్నారు. సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్వయంగా శంషాబాద్ లోని ప్రతాప్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు.షాద్ నగర్ బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన చౌలపల్లి ప్రతాప్ రెడ్డి గత కొంతకాలంగా అసంతృప్తితో వున్నారు. దీంతో రేవంత్ రంగంలోకి దిగారు.షాద్ నగర్ నుంచి పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ ను గెలిపించాలని,పార్టీ అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఆయన తో పాటు ఫరూక్ నగర్ జడ్పీటీసీ పంది వెంకట్రాంరెడ్డి, కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డితో పాటు చాలా మంది ఆయన అనుచరులు బిఆర్ఎస్ పార్టీని వీడనున్నట్లు తెలుస్తుంది.



## బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

**దేవరుప్పుల, విశాల భారతి:** పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు రుద్రోజు భాస్కరా చారి, కాంగ్రెస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు రుద్రోజు పురుషోత్తం ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలం,పెద్ద మదూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య, చిర్రా రవి, నా రెడ్డి ఉప్పలయ్య, కర్రి సోమయ్య, ఊడుగుల యాదయ్య,మునిగొండ జీవన్,గణిపాక ప్రదీప్,పానుగంటి భాను, మునుగొండ సందీప్, మునుగొండ అంజి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మామిళ్ళ రమేష్, భువనగిరి మారాలు, మామిళ్ళ రవి, దండు ప్రభాకర్, మధురి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీలో చేరిన పలు పార్టీల నాయకులు

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలం, సింగరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, తదితర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సీనియర్ నాయకులు పల్లా సుందర్, రామిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు మేకపోతుల నరసింహ గౌడ్ అధ్వర్యంలో రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో జాకెట్ సాయి, పల్లపు యాదగిరి, జాటోత్ వీరన్న, అజ్మీర రాజు, పల్లపు లింగయ్య,ధరావత్ రాజు ,బత్తిని పరశురాములు, జాటోత్ వెంకన్న,బత్తిని భిక్షపతి,వెంకన్న చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.




## సేవాలాల్ సేన దేవరుప్పుల మండల మహాసభను విజయవంతం చేయండి

**సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ శంకర్ నాయక్**

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలం ధరావత్ తండా, ధర్మాపురం తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సేవాలాల్ సేన దేవరుప్పుల మండల మహా సభ కరపత్రాలను జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతు ఈ సేవాలాల్ సేన సంఘాన్ని 2015 సెప్టెంబర్ 9వ తేదీన హైదరాబాదులో జగద్గురు బాల్ బ్రహ్మచారి సంత్ తపస్వి శ్రీశ్రీశ్రీ రామ్ రావ్ మహారాజ్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. సేవాలాల్ సేన ఒక విప్లవం ఒక ఆశయం ఒక ధైర్యం ఒక గమ్యం అన్నింటికీ మించి మన జాతి కోల్పోతున్న సాంప్రదాయ సంస్కృతిని పరిరక్షిస్తూ గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కుల సాధనకై ఏర్పడ్డ ఒక విజనరీ అన్నారు. మరెన్నో డిమాండ్లు నెరవేరేవరకు సేవాలాల్ సేన ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే సంకల్పంతో 18 10 2023న సేవలాల్ దేర్పుల మండల మహా సభ గొప్పగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఈ సభకు సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్, సేవాలాల్ సేన త్రిసభ్య కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్చందాన్నాయక్, చిన్నబాబు నాయక్, ప్రముఖ గిరిజన మేధావులు హాజరవుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన మండల నాయకులు ధారావత్ స్వామి కున్సోత్ బిక్కు నాయక్ కొ లింగన్న నాయక్ గేమ నాయక్ ధరావత్ కీమా నాయక్ జాటోత్ సోమన నాయక్ జాటోత్ సంతోష్ ధరావత్ కిరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు



## బోడుప్పల్లో గులాబీ జెండా ఎగిరేద్దాం

**బిఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి.**

**బోడుప్పల్,విశాలభారతి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 17 డివిజన్ కాలనీ వాసులు అందరూ మణికంఠ నగర్ లొ సమావేశం చేయడం జరిగింది. రానున్న ఎన్నికల్లో మల్లారెడ్డి కి బీఫామ్ టికెట్ ఇవ్వడంతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడిగా పోరాటం చేసి గులాబీ జెండా ఎగిరేద్దాం అందరం సిద్ధంగా ఉన్నామని BMC BRS పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి. నగర మేయర్ సామల బుచ్చిరెడ్డి. కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్. చీరాల నరసింహ. పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ. పార్టీ సీనియర్ నాయకులు కొత్త చక్రపాణి గౌడ్. రవి గౌడ్. కాటపల్లి రామచంద్రారెడ్డి. ఆధ్వర్యంలో డివిజన్లో ఉన్న కాలనీ వాసులందరూ టిఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పడం జరిగింది.




## నూతన వస్త్రాలయం ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి గ్రామంలో ఎన్ ఆర్ రెడీమేడ్ దుస్తుల షాపు నూతనంగా ఏర్పాటు చేసిన సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కూడా అందుబాటులో ఇటువంటి వస్త్రాలయాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల యువతకు ప్రజలకు సిటీకి వెళ్లి కొనుక్కునే అవసరం లేకుండా అందుబాటులో దొరుకుతున్నాయన్నారు. కాబట్టి మన గ్రామాలను ఇలాంటి అన్ని రకాల వస్తువుల ప్రోత్సాహకరమైన షాపులు గ్రామా గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఇంకా ఎంతో అభివృద్ధి చేసుకోవాలని అన్ని వస్తువులు దొరికే విధంగా గ్రామాలు ఏర్పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు ప్రజలు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

- **ముఖ్య అతిథిగా హాజరైన ఇక్రిశాట్ మేనేజర్ , ఆత్మీయ అతిథిగా వ్యవసాయ పరిశ్రమవేత్త**

**పటాన్ చెరువిశాలభారతి:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎఫ్ఎస్టీ) విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నీరు జీవితం, నీరు ఆహారం, ఎవరినీ వదిలిపెట్టవద్దు అనే ఇతివృత్తంలో ఈ ఏడాది వేడులకు నిర్వహించాలన్న ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో) పిలుపులో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. నీటి ఒత్తిడి ఉన్న దేశాలలో 2.4 బిలియన్ల ప్రజలు, జల, ఆహార వ్యవస్థలపై ఆధారపడిన 600 మిలియన్ల మంది వ్యక్తులు ఎదుర్కొంటున్న సవాళ్లపై దృష్టి సారించారు. ఇక్రిశాట్ లోని నేల సారవంతం, నీటి నిర్వహణ మేనేజర్ డాక్టర్ పుష్పజీత్ చౌదరి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, వాతావరణ స్థితిస్థాపక వ్యవసాయం కోసం నేల, నీటి నిర్వహణ అనే అంశంపై ఉపన్యసించారు. స్థిరమైన నీటి నిర్వహణ ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, సహకార నీటి భాగస్వామ్యం, సమాజంలోని అందరూ పాల్గొనడం, శిక్షణ, అవగాహన అవసరమన్నారు. మన దేశంలోని ఉత్తర మైదానాలలో భూగర్భ జలాల పునరుద్ధరణకు, నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు చిరుధాన్యాల (మిల్లెట్ల) సాగు ఎలా దోహదపడుతుందో ఓ అధ్యయనాన్ని ఉటంకిస్తూ డాక్టర్ చౌదరి వివరించారు. తన కుమారుడితో కలిసి వ్యవసాయ పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న బి.జయలక్ష్మి ఆహారోత్పత్తిలో వైవిధ్యత ఆవశ్యకతను వెలుగులోకి తెచ్చారు. ఈ భూమండలం మీదున్న అర మిలియన్ వృక్షజాతులలో కేవలం 30 వేలు మాత్రమే ఆహారం అందిస్తున్నాయని, అందులో కేవలం నాలుగు పంటలుమొక్కజొన్న, గోధుమ, వరి, సోయా పంటలు 60 శాతం ఆహార అవసరాలను తీరుస్తున్నాయని చెప్పారు. కేవలం ఆ నాలుగింటిపై ఆధారపడకుండా వినియోగంలో లేని వృక్ష జాతులను వెలుగులోకి తేవాల్సిన ఆశ్యకతను ఆమె వివరించారు. స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి కె.నగేష పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, ఎఫ్ఎస్టీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వరి కోడి స్వాగతోపన్యాసం చేసి, అతిథులను సత్కరించారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పరుల్ థాపర్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఆ తరువాత అతిథులతో కలిసి అధ్యాపకులు, విద్యార్థులు గీతం ప్రాంగణంలో మలబారు వేప మొక్కలను నాటారు.







# ఆరు స్కీములతో అధికారంలోకి వస్తాం

- కాంగ్రెస్ స్కీములను కాపీ కొట్టిన బీఆర్ఎస్
- పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి

**తొర్రూరు, విశాల భారతి:** ఆరు గ్యారెంటీ స్కీములతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి స్పష్టం చేశారు. హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో తొర్రూరు మండలంలోని వెలికట్ట, నాంచారి మడూరు గ్రామాల్లో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దయాకర్ రావుకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఒకే వ్యక్తికి మూడు పర్యాయాలు అవకాశం ఇస్తే అధికార దుర్వినియోగం జరుగుతుందని, మంత్రి ఎర్రబెల్లి ఆగడాలను ప్రశ్నిస్తే సామాన్యులపై కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు నేటికీ పాలకుర్తి నియోజకవర్గంలో కనిపిస్తున్నాయని, కాంగ్రెస్ కు అవకాశం ఇస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుందని హామీనిచ్చారు. తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ మంత్రివర్గం కొలువుదీరిన రోజు నుంచే అమల్లోకి తెస్తామన్నారు. నూతనోత్తేజంతో, స్పష్టమైన సందేశంతో వెళదామని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హామ్య నాయక్, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ , ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు రవి నాయక్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉష, మహిళా మండల అధ్యక్షురాలు ప్రశాంతి, మాలోతు సునీత రాజేందర్, నాయకులు భాస్కర్ రాజు పబ్బాల రాము, ధీకొండ సరిత, వడ్లకొండ వెంకట సాయిలు, కుమార్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.



## అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీనే

- ఎమ్మెల్యే చిరుమర్తి
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బిఆర్ఎస్ పార్టీ గెలుపు అభివృద్ధికి మలుపే మన నినాదం
- బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే చిరుమర్తి

**చిట్యాల,విశాలభారతి:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అధిక మెజారిటీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలమండలం గుండ్రాంపల్లి బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మారగోని శివశంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ సిఎం కేసీఆర్ పాలనలో ప్రతి ముఖంలో అనందం ప్రతి ఇంటికి సంక్షేమ అందుతుందన్నారు.పసిపాప నుండి పండు ముసలి వరకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని నకిరేకల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ శ్రేణులందరిని కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. కేసీఆర్ రుణం తీర్చుకోవాలనీ రాబోవు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ని భారి మెజార్టీతో గెలిపేంచుందుకు గులాబీ శ్రేణులంతా కృషి చేయాలన్నారు. బూత్ కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి వెళ్ళి సీఎం కెసిఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను వివరించాలని మేనిఫెస్టో లో ప్రకటించిన హామీలను ప్రజలకు వివరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొలను వెంకటేష్ గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి,సుంకరి యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు ఆవుల అయిలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి,మహిళా విభాగం అధ్యక్షురాలు చెరుకుపల్లి శశిరేఖ మహేష్, సర్పంచ్ రత్నం పుష్ప నర్సింహా, కో ఆప్షన్ సభ్యులు మోసిన్, నాయకులు రాచకొండ కిష్టయ్య, సుంకరి యాదగిరి గౌడ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బీమిడి వెంకట్ రెడ్డి,గుడి చైర్మన్ చెరుకు మదు, కోయగూర నర్సింహా, బాతరాజు రవీందర్,యాకారి నరేందర్, తుమ్మల నాగరాజు రెడ్డి, నమ్మల అనిల్, వివిధ హోదాలో ఉన్న నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## దోరెపల్లి గ్రామం బిఆర్ఎస్ నుండి బిజెపిలోకి వలసల పర్వం

**కనగల్, విశాల భారతి:** బి ఆర్ ఎస్ పార్టీ దోరేపల్లి గ్రామ ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ సర్పంచి ఒంటెద్దు పోకడలకి నిరసనగా బి ఆర్ ఎస్ పార్టీ నుండి బిజెపి పార్టీ లోకి జాయిన్ అయ్యారు. కనగల్ మండలం దోరెపల్లి గ్రామం నుండి తెలంగాణ ఉద్యమ కారుడు గ్రామ ఉప సర్పంచ్ దాసరి వెంకన్న, వార్డ్ సభ్యులు నకిరేకంటి నరేష్, మాధగోని విజయలక్ష్మి శంకర్ , బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మాధగోని సైదులు, బి ఆర్ ఎస్ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు మాజి గ్రామ శాఖ అధ్యక్షులు మాధగోని ఏడుకొండలు ,పసునూరి వెంకన్న, బక్క లింగయ్య, మాధగోని అశోక్, పగిల్ల రాములు, బక్క శివ కుమార్, కిన్నెరా యాదయ్య, దాసరి సాయిలు, దాసరి లచ్చయ్య, భైరగోని చంద్రయ్య, మాధగోని నరేందర్, మాధగాని వెంకన్న, భైరగోని శివశంకర్, పగిల్ల నర్సింహా పగిల్ల వెంకన్న, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధగోని శ్రీనివాస్ గౌడ్, నాయకత్వాన్ని బలపరుస్తూ నిన్న బీజేపీ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ కనగల్ మండలం అధ్యక్షులు పులకరం బిక్షం, దోరెపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు మాధగోని తిరుమల్ గౌడ్, శక్తి కేంద్రం ఇంచార్జి భైరగోని శేఖర్, సముద్రాల మల్లేష్ నరేష్, బాలకృష్ణ సురేష్, తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికల నిబంధనలను దిక్కరించిన మున్సిపాలిటీ అధికారులు

**మణుగూరు, విశాల భారతి :** `తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ అధికారికంగా షెడ్యూల్ విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న నోటిఫికేషన్ విడుదల కాగా నవంబర్ 30న పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3న ఫలితాలు వెలువడనున్నాయి.

షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆరోజు నుండి డిసెంబర్ 5 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. దీంతో రాష్ట్రంలో చాలా నిబంధనలు అమలులోకి వస్తాయి. అయితే ఎన్నికల కోడ్ విడుదల చేసినా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల మున్సిపాలిటీ అధికారులు ఎన్నికల కోడ్ను ధిక్కరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రదేశాలలో ఏ పార్టీ పోస్టర్లు కూడా ఉండకూడదు . కానీ మణుగూరు మున్సిపాలిటీ ఏరియాలలో పలుచోట్ల బి ఆర్ ఎస్ పార్టీ వాల్ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు వాటిని చూసి కూడా తొలగించకపోవడం గమనార్హం.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు తప్పక పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పలు సూచనలు చేసినా మున్సిపాలిటీ అధికారులు ఏమాత్రం ఆచరణ చేయడం లేదు. మణుగూరు మున్సిపాలిటీ అధికారులలో కొంతమంది అధికారులు బీఆర్ఎస్ పార్టీకి సపోర్ట్ చేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆరోపణలకు నిదర్శనమే గోడలపై బీఆర్ఎస్ వాల్ పోస్టర్లు కనిపించడం. ఈ పోస్టర్లని ఎందుకు తొలగించడం లేదని ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారు. ఈ కార్యాలయంలో అంతా సస్పెండ్ అయిన అధికారులే ఉన్నారే తప్ప ఈ ఎన్నికల నియమ నిబంధనలు పాటించే అధికారులు లేరని ప్రజలు, ప్రతిపక్షాలు పలు విమర్శలు కురిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్పందించి మణుగూరు మున్సిపాలిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## గడీల పాలనకు పాడాలి చరమగీతం

- కాంగ్రెస్ పార్టీ గెలుపుకై కృషి చేయాలి
- నకిరేకల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



**నకిరేకల్, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కృషి చేయాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నార్కట్పల్లి మండలం హోటల్ వివెరాలో చిట్యాల మండల బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ కాటం వెంకటేశం, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పేరేపల్లి సర్పంచ్ అంతటి వెంకటేష్ గౌడ్, తాళ్ల వెల్లంల సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్, వెంబావి సర్పంచ్ అద్దెల నర్సిరెడ్డి, ఎంపిటిసి వడ్డేపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ బట్టు ఐలేష్ యాదవ్, ఆర్ఎస్ఎస్ ఆర్డినేటర్ అద్దెల లింగారెడ్డి, వివిధ హోదాలలో ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గరలోనే ఉందని అభివృద్ధి పేరుతో కోట్లు గడించుకున్న గడీల పాలనకి స్వస్తి చెప్పాలని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా వేముల వీరేశంని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకునే అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉందని కచ్చితంగా నకిరేకల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ముక్తకంఠంతో నినదించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్ బృందం పర్యటన

**అశ్వాపురం, విశాల భారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొత్తి గ్రామాలల్లో సోమవారం ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించి గ్రామస్తుల రక్త నమూనాలు సేకరించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే దోమలు కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. చత్తీస్గఢ్ నుండి రాకపోకలు జరగడం వలన మలేరియా వచ్చే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఐసిఎంఆర్ టీం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నెలరోజులపాటు మలేరియా ప్రభావిత గ్రామాలను సందర్శించి రక్త నమూనాలు సేకరిస్తారు. ఈ సందర్భంగా మలేరియా కు సంబంధించిన మందులు పనిచేస్తున్నాయో, లేదో తెలుసుకొని పని చేయకపోతే వేరే మందులను అందజేస్తామన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, జిలింగ్యా నాయక్, ఏఎన్ఎంలు, ఏ ఎస్ హెచ్ లు, పాడియాభట్, మనీష్ కుమార్, చంద్ర వంశీ, ఢిల్లీ ద్వారక టీం సభ్యులు పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణకు నేటి నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- సూర్యాపేట జిల్లాలో 296 కొనుగోలు కేంద్రాలు
- జిల్లా డివిజన్ స్థాయి కమిటీల ఏర్పాటు.

**సూర్యాపేట, విశాల భారతి:** వానకాలం వరి ధాన్యం సేకరణకు ప్రణాళిక బద్ధంగా ముందస్తు ఏర్పాట్లకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, ఏఈవోలు, మెప్మా పిడి, డిఆర్ డి ఏ, సహకార శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ ఏ.వెంకట్ రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానకాలం 202324 ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాలో 296 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఐకెపి ద్వారా 183 పిఎసిఎస్ ద్వారా 113 ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 4,15,559, మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నేటి నుండి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, అధికారులందరూ ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని, ప్రారంభోత్సవ బ్యానర్లపై ఎలాంటి ఫోటోలు పెట్టకూడదని జిల్లా కలెక్టర్ సూచించారు.

పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, రవాణా, గ్రామీణ అభివృద్ధి, తూనికల కొలతలు, వ్యవసాయ శాఖ అధికారులతో వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. ధాన్యం కొనుగోల ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ అన్నారు. మండలాలలో నోడల్ అధికారిగా తాసిల్దార్ వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం మొత్తం1,03,88,975.గన్నేరు అవసరం కాగా 61 లక్షల గన్నిలు సిద్ధంగా ఉన్నాయని, ఇంకా 42 లక్షల గన్ని బ్యాగులు రావాల్సి ఉందని డిఎం మార్కెటింగ్ రాంపతి జిల్లా కలెక్టర్కు తెలిపారు. రైతులు కల్లాల వద్ద ధాన్యం ఆరబెట్టి నాణ్యత ప్రమాలతో కూడిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు రైతు వేదికలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులందరూ బ్యాంకు ఖాతాలు కలిగి ఉండేలా వ్యవసాయ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ కిరణ్ కుమార్,ఆర్డీవోలు వీర బ్రహ్మచారి, జగదీశ్ రెడ్డి, సూర్యనారాయణ, వ్యవసాయ అధికారి రామారావు నాయక్,డిఎస్ఓ మోహన్ బాబు, రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా తూనికల అధికారి కే.వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపి, బీఆర్ఎస్ పార్టీలను సాగనంపుదాం

- వచ్చే ఎన్నికల్లో గెలుపోటములు శాసించేది కమ్యూనిస్టులే
- రాష్ట్రంలో కుటుంబ పార్టీకి చరమగీతం పాడాలి
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమట వెంకటేశ్వరరావు




**అశ్వాపురం, విశాల భారతి :** దేశ సమగ్రత, సమైఖ్యతకు విఘాతం కలిగించే బిజేపిని, ఆ బిజేపితో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్న బిఆర్ఎస్ లను గద్దె దింపేందుకు ప్రజా స్వామిక లౌకిక శక్తులు ఏకం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం అశ్వాపురం సిపిఐ కార్యాలయంలో జరిగిన సిపిఐ పార్టీ మండల విస్తృత కార్యవర్గం కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మతోన్మాదం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఆర్ఎస్ఎస్ అదేశాలను అనుసరిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతూ, రాముని పేరు జపిస్తూ రాక్షస పాలన సాగుస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో బిజేపి ఆగడాలకు అడ్డుకట్ట వేయకుంటే దేశం అదోగతిపాలవుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా బిజేపికి వ్యతిరేకంగా పనిచేస్తున్న అన్ని శక్తులను కలుపుకుని బిజేపిని, రాష్ట్రంలోనూ అదే తరహాలో బిఆర్ఎసు గద్దె దించేంత వరకు విశ్రమించేదే లేదన్నారు. ప్రజలను మోసం చేయడంలో, మాటల గారడితో ప్రజలను మభ్యపెట్టడంలో కేసీఆర్ దిట్ట అని, వివిధ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను కేసీఆర్ ఘోరంగా మోసం చేశాడన్నారు. బిఆర్ఎస్ ప్రవేశపెట్టి ఏ పథకమూ పూర్తి స్థాయిలో అమలు చేయలేక చతికలపడిందని, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ పథకాలకు అర్హులైన పేదల నిండా ముంచాడు విమర్శించారు. రాష్ట్రంలో కుటుంబపాలన సాగుతోందని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మారారేగాని ప్రజల పక్షాన ప్రశ్నించే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గెలుపోటములు శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందని, స్పష్టం చేశారు. ఉద్యమాల పురిటిగడ్డ అయిన భద్రాది జిల్లాకు అనేక మంది వచ్చిపోతుంటారని, కానీ నిరంతరం ప్రజలతో ఉండేది కమ్యూనిస్టులు మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మద్ది వెంకటరెడ్డి, సిపిఐ అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్, సిపిఐ అశ్వాపురం మండలం సహాయ కార్యదర్శిలు, మేలపుర సురేందర్ రెడ్డి, రాయపూడి రాజేష్, ముత్తిబోయిన వెంకటేశ్వర్లు, ఈనపల్లి పవన్ సాయి, దండి నాగేష్, నవీన్, అక్కనపల్లి నాగేంద్రబాబు, ఇరుగు శ్రీకాంత్, రెడ్డిబోయిన వెంకన్న, ముద్దుశెట్టి నరసింహారావు, మహిళా మండల నాయకులు, తెల్ల వెంకటరమణ, తురక అచ్చమ్మ, తదితరులు హాజరయ్యారు.



## కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ లోకి వలసలు



**తొర్రూరు, విశాల భారతి:** తొర్రూర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 11వ వార్డు కాంగ్రెస్ యూత్ నాయకుడు చింతల రాజు వర్గీయులు 60 మంది కాంగ్రెస్, బిజెపి యువ నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ గూటికి చేరారు. కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకలు ఆకర్షితులై గులాబీ కండువా కప్పుకున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. నూతనంగా బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, రైతు సమన్వయ సమితి సభ్యుడు రామ సహాయం కిషోర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోధన్ బీఆరెస్‌లో అలజడి..

- కాంగ్రెస్ గూటికి తూము శరత్‌రెడ్డి
- మున్సిపల్ చైర్‌పర్సన్‌తో సహా పది మంది కౌన్సిలర్లు, సర్పంచులు..
- ఎంఐఎం కౌన్సిలర్లు కూడా... గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక
- ఫలించని కవిత మధ్యవర్తిత్వం
- షకీల్‌ను ఓడిచేందుకే అని ప్రకటించిన శరత్‌రెడ్డి



**నిజామాబాద్,విశాలభారతి:** బోధన్ బీఆరెస్‌లో అలజడి మొదలయ్యింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి ఆమె భర్త, కౌన్సిలర్, సీనియర్ బీఆరెస్ నాయకుడు తూము శరత్‌రెడ్డి తన అనుచరగణంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. తనతో పాటు పది మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో ఎంఐఎం పార్టీకి చెందిన కౌన్సిరల్లు కూడా ఉన్నారు. పలువురు సర్పంచులు, ఇతర నాయకగణం శరత్‌రెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గత కొంతకాలం గా బోధన్ ఎమ్మెల్యే షకీల్‌కు శరత్ రెడ్డికి మధ్య అసలు పొసగడం లేదు. ఏవో కారణాల చేత షకీల్.. శరత్‌రెడ్డిని దూరం చేసుకున్నాడు. శరత్‌రెడ్డి సైతం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. షకీల్ ఎంఐఎంతో కూడా కయ్యానికి కాలు దువ్వాడు. దీంతో వారు కూడా శరత్‌రెడ్డి పంచన చేరారు. వీరందరినీ తీసుకుని కాంగ్రెస్‌లో చేరుతున్నానని, షకీల్‌ను ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నానని శరత్‌రెడ్డి బాహాటంగానే ప్రకటించారు. ఎమ్మెల్సీ కవిత మధ్యవర్తిత్వం కూడా పనిచేయలేదు.ఆయన ఎవరి మాట వినలేదు. పొంగులేటి శ్రీనివాస్‌తో మంతనాలు జరుపుకున్న శరత్‌రెడ్డి.. సోమవారం తన టీమ్‌తో గాంధీభవన్‌కు బయలుదేరి వెళ్లాడు. బోధన్ బీఆరెస్‌లో ఇదో రాజకీయ అలజడి సృష్టించనుంది. వాస్తవంగా అక్కడ మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గెలుపు అంత ఈజీగా లేదు. కానీ శరత్‌రెడ్డి రాకతో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడే అవకాశాలున్నాయి.





# గులాబీ జెండా ఎగరవేద్దాం

**బిఆర్ఎస్ మేనిఫెస్టో తో బీజేపీ, కాంగ్రెస్ డిపాజిట్లు గల్లంతు**

**విశాలభారతి,అమనగల్లు:** బిఆర్ఎస్ మేనిఫెస్టోతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు దిమ్మ తిరిగిపోయిందని కల్వకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని ఆన్మాస్ పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల జయభేరి ప్రారంభించారు. అనంతరం కడ్తాల్ మండల కేంద్రంలోని ఎంబిఏ గార్డన్లో నియోజకవర్గం బిఅర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరాలి,కెసిఆర్ మహా శక్తి అని కొనియాడారు. ఎన్నికల ముందు కొన్ని పార్టీల నాయకులు దొంగల్లా వచ్చి కల్లబొల్లి గారడీ మాటలు చెప్పడానికి వస్తారని జాగ్రత్త అని అన్నారు. నియోజకవర్గంలో 6వేల గృహలక్ష్మి ప్రోసిడింగులు , 1500 మందికి దళిత బంధును లబ్ధిదారులకు అందజేశాం అని తెలిపారు. కల్వకుర్తి ప్రజల అశీస్సులతో చివరి రక్తపు బొట్టు వరకు సేవా చేస్తానన్నారు. 60 సంవత్సరాల నుండి ఏనాడూ చేయని అభివృద్ధి నేడు కేవలం ఎన్నికల కోసమే ఈ కపట నాటకాలు, కాంగ్రెస్ పార్టీ అబద్ధపు మెనిపోస్టోను నమ్మొద్దని, రాష్ట్రంలో కేంద్రంలో లేని కాంగ్రెస్ ఏ సూత్రం పాటించారు. మతాలను, కులాలను అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తుంది, అలాంటి బిజెపి పార్టీకి కల్వకుర్తిలో డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మదిరిగేలా ప్రతి గడప గడపకు తెలియజేయాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పాక్స్ చైర్మన్ గంప వెంకటేష్, తలకొండపల్లి మండల ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, కడ్తాల్ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆమనగల్లు మండల పార్టీ అధ్యక్షుడు అర్జున్ రావు, ఆమనగల్లు మండల వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ ఖలీల్, సీఎల్ శ్రీనివాస్ యాదవ్ కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షుడు కంబాల పరమెష్, బిఅర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# మాకొద్దీ ఆంధ్రా నాయకుడు



- రూరల్ కాంగ్రెస్‌లో 'మండవ' చిచ్చు
- ఆందోళనలకు పిలుపునిచ్చిన రూరల్ కాంగ్రెస్ శ్రేణులు.
- భూపతిరెడ్డి లేదా నగేశ్‌రెడ్డిలకే టికెట్ ఇవ్వాలని ఒత్తిడి
- మండవ వెంకటేశ్వర రావు జాయినింగ్‌కు ముందే రూరల్‌లో బ్రేకులు
- సీనియర్ నేతకు ఈ పార్టీలో ఆదిలోనే హంసపాదు..

**నిజామాబాద్,విశాలభారతి:** సీనియర్ నేత మండవ వెంకటేశ్వరరావుకు రాజకీయాలు అచ్చి రావడం లేదు. ఆయన రిటైర్‌మెంట్ ప్రకటించుకున్న తర్వాత మళ్లీ రాజకీయాల్లోకి రావాలనుకోవడం కలిసి వస్త లేదు. నాడు కవితను ఎంపీగా గెలిపించేందుకు కేసీఆర్ మండవ ఇంటికి వెళ్లి మరీ పార్టీలోకి ఆహ్వానించాడు. ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో ఆయన రాజకీయాలకు దూరంగానే ఉంటూ వస్తున్నాడు. ఇప్పుడు రేవంత్ రెడ్డి మళ్లీ మండవ ఇంటికి వెళ్లాడు. పార్టీలో తర్వలో జాయినింగ్ ఉంది. క్లారిటీ వచ్చింది. రూరల్ టికెట్ ఇస్తామనే కమిట్‌మెంట్ ఇచ్చారు. అంతా బాగానే ఉంది. ఇప్పుడు ఆ ఇద్దరి నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, నగేశ్ రెడ్డి లు ఇద్దరూ మండవ రాకను వ్యతిరేకిస్తూ ఇవాళ నియోజకవర్గంలో ఆందోళనలకు దిగారు. ఇస్తే గిస్తే మాలో ఎవరికో ఒకరికి ఇవ్వాలి.. ఈ ఆంధ్ర నాయకుడు మధ్యలో ఎక్కడ్నుంచి వచ్చాడంటూ మండవ సీనియారిటీని, అధిష్టానం నిర్ణయాన్ని చీ కొడుతున్నారు. ఇప్పుడిది ఇందూరు కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అరికెల నర్సారెడ్డి కాంప్రమైజ్ అయిపోయా డు. ఇతనితో బాధ లేదు. ఇప్పుడు వచ్చిన చిక్కంతా భూపతిరెడ్డి, నగేశ్‌రెడ్డితోనే. దీనికి తోడు ఆంధ్ర, తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేస్తు న్నారు ఈ ఇద్దరు అసంతృప్త నేతలు. దీంతో మండవ రాక పార్టీకి ప్లస్ ఏమోగానీ, వీరి చేష్టలతో మరింత దిగజారేలా ఉంది.



# మల్కాజ్ గిరి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ మైనంపల్లి

**అల్వాల్, విశాలభారతి:** మైనంపల్లి హనుమంతురావు చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మైనంపల్లి హనుమంతురావు సతీమణి 134, 135 వ డివిజన్ లలో ప్రజలతో మమేకమై నడిచారు. గడప గడపకు వెళ్లిన వారు ప్రేమగా పలకరించి ప్రేమగా మాట్లాడుతున్నారని మైనంపల్లి సతీమణి తెలిపారు. అంతేకాకుండా మల్కాజిగిరిని అభివృద్ధి పథంలో నడిపించిన వ్యక్తి మైనంపల్లి హనుమంతురావు. మైనంపల్లి అంటేనే అభివృద్ధి అభివృద్ధి అంటే మైనంపల్లి అని ప్రజలు మైనంపల్లి వెనకాల నడుస్తున్నారని తెలిపారు. అభివృద్ధి చేయడానికి ఏ పార్టీ అయినా ఒకటే మన సంకల్పం ప్రజలకు మేలు చేయాలని నిరంతరం పరితపించే వ్యక్తి మైనంపల్లి హనుమంతరావు అని ఆయన సతీమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సంజీవ్, శేఖర్, నరేష్, శ్యాంసుందర్, శివశంకర్, పద్మ, భబిత నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇచ్చిన హామీలను అమలు చేయలేదు

**శాలిగౌరారం, విశాల భారతి :** ఊట్కూరు గ్రామం నుండి బండమీదిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డును వెంటనే నిర్మాణం చేపట్టాలని, ఊటుకూరు గ్రామంలో బస్టాండ్ నుండి గ్రామపంచాయతీ వరకు బొడ్రాయి బజార్ నుండి తూర్పు బజారు వరకు మంచినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల దహర్తిని తీర్చాలని వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో సోమవారం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఇందూరు సాగర్, సిపిఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య మాట్లాడుతూ ఊటుకూరు గ్రామం నుండి బండమీది గూడెం గ్రామానికి మూడు కిలోమీటర్ల వరకు రోడ్డు అద్వానంగా తయారయ్యి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వృద్ధులు వికలాంగులకు గర్భిణీ స్త్రీలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు అంబటి చిరంజీవి,గ్రామ కార్యదర్శి రావుల లింగయ్య,నాయకులు కప్పల విజయ,PYL జిల్లా ఉపాధ్యక్షుడు బండారు వెంకన్న,రైతు కూలీ సంఘం నాయకులు వేముల శంకర్, సిపిఎం సీనియర్ నాయకులు సిరుపంగి రాములు,సీపీఎం గ్రామ నాయకులు గుండాల సత్యనారాయణ, అన్నెబోయిన కిరణ్,బుక్కరాజు యాదయ్య, సైదులు, నాగార్జున, అంతయ్య,కప్పల శ్రీను,యాదయ్య, నర్సయ్య, సైదులు, రాకేష్, శంకర్,వెంకలు, శ్రీను, ఉపేందర్, సురేందర్, మెట్టు శివ,సాయి కిరణ్,దామోదర్, బుర్రెసైదులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ మేనిఫెస్టో

**మండల పార్టీ అధ్యక్షులు గుగూలోతు కృష్టనాయక్**

**గరిడేపల్లి, విశాల భారతి :** సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ మేనిఫెస్టో అని మండల పార్టీ అధ్యక్షులు గుగూలోతు కృష్టనాయక్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రములో శాసన సభ్యులు శానంపూడి సైదిరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్న బిఆర్ఎస్ నాయకులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారని సబ్బండ వర్గాల సంక్షేమాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చిన మేనిఫెస్టో అన్నారు. ముచ్చటగా మూడోసారి గులాబీ జెండాకు విజయం చేకూర్చే మేనిఫెస్టో అని, ఇది ప్రజల మేనిఫెస్టో అని, తొమ్మిదిన్నరేండ్లుగా ఇచ్చిన హామీలు అమలు చేసి, ఇవ్వని హామీలను కూడా ఆచరణలోకి తెచ్చిన సీఎం కేసీఆర్ ఈ మేనిఫెస్టోలోని హామీలను వందశాతం అమలు చేస్తారని ప్రజలు సంపూర్ణంగా విశ్వసిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాసు గౌడ్,గుత్తికొండ వెంకటరమణారెడ్డి బిఆర్ యస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బెంచ్ ప్రెస్ పోటీలలో సత్తా చాటిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు

**భద్రాచలం, విశాల భారతి:** ఈ నెల 15న డోర్నకల్ లో జరిగిన ఆరు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు మూడు బంగారు పథకాలు, రెండు సిల్వర్ పథకాలు, ఒక కాంస్య పథకం సాధించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 69 కేజీల ఉమెన్స్ విభాగంలో మామిడి భూమికకు బంగారు పథకం, 59 కేజీల విభాగంలో ఎస్ భరత్ కుమార్ కు బంగారు పథకం, 105 కేజీల విభాగంలో మోతుకూరి పవన్ కు బంగారు పతకం, 73 కేజీల విభాగంలో వి కాశి కుమార్ కు సిల్వర్ పథకం, 105 కేజీల విభాగంలో అంజి రెడ్డికి కాంస్య పథకం, 105 కేజీల మాస్టర్స్ విభాగంలో శోభన్ నాయక్ గుగులోత్, (ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ )కు సిల్వర్ పథకము, సాధించినట్లు తెలిపారు. ఈ గెలుపొందిన క్రీడాకారులు సిటీ స్టైల్ జిమ్ లో ఈ విజయానికి కారణమైనటువంటి జిమ్ కోచ్ జివి రామి రెడ్డినీ సాలువతో ఘనంగా సన్మానించారు. జిమ్ కోచ్ జివి రామిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 21న హైదరాబాదులోని షేక్ పేటలో జరగబోయే రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలకు ఇప్పుడు గెలుపొందిన విద్యార్థులంతా హాజరవ్వాలని ఈ సందర్భంగా వారికి తెలియజేశారు.





# ప్రజా ఆశీర్వాద ర్యాలీకి వెళ్తున్న పార్టీ శ్రేణులు

**రెండోసారి ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్య యాదవ్ గెలుపు ఖాయం**

**నడిగూడెం, విశాల భారతి:** కోదాడ ఎమ్మెల్యేగా రెండోసారి బొల్లం మల్లయ్య యాదవ్ గెలుపు ఖాయమని మండల పరిషత్ అధ్యక్షురాలు యాతాకుల జ్యోతి మధుబాబు అన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ అధినేత, కెసిఆర్ చేతుల మీదుగా బిఆర్ఎస్ పార్టీ బీఫామ్ అందుకొని కోదాడ విచ్చేయుచున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కు ఘన స్వాగతం పలికేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుండి పెద్ద ఎత్తున భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులు కోదాడ ముఖద్వారం మునగాల మండలం మాధవరం గ్రామం వద్ద స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి కోదాడ వరకు ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకిరాల గ్రామంలో ర్యాలీకి వెళ్తున్న నాయకులకు జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు దేవబత్తిని సురేష్ ప్రసాద్, దేవబత్తిని వెంకట నరసయ్య ,గోసుల రాజేష్ పల్లా నర్సిరెడ్డి గార్లపాటి శ్రీనివాస్ రెడ్డి, పుట్టా రమేష్ యాతాకుల వీరస్వామి, బడేటి చంద్రయ్య ,మంచికంటి వెంకటరెడ్డి, నాగేందర్ రెడ్డి, అనంతుల ఆంజనేయులు అన్ని స్థాయిల పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, మల్లన్న అభిమానులు, శ్రేయోభిలాషులు, మల్లన్న యువసేన నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



# జన సైనికుడై వస్తున్నా..

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటి చేస్తున్నా
- నా గుర్తు సింహం గుర్తు

**నల్గొండ, విశాల భారతి:** బిఆర్ఎస్ పార్టీకి దూరం అయిన పిల్లి రామరాజు యాదవ్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుండి సింహం గుర్తుపై నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తను రాజకీయంగా ఎదిగి వచ్చిన విధానాన్ని మీడియాతో పంచుకున్నాడు. సోమవారం నల్లగొండ పట్టణంలో పిల్లి రామరాజు యాదవ్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరిన నాటి నుంచి పార్టీ ఏ పిలుపునిచ్చిన అందుకొని తన కర్తవ్యాన్ని నిర్వర్తించానని అన్నారు. 20 ఏళ్ల కాంగ్రెస్ కంచుకోటైన నల్లగొండ నియోజకవర్గంలో బద్దలుకొట్టి బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేశామని గుర్తు చేశారు. భూపాల్ రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత కష్టకాలంలో తనకు అండగా ఉన్న వారందరిని మర్చిపోయి అధికార దాహంతో నాలాంటి ఎంతో మందిని దూరం చేసుకున్నాడు అన్నారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల వేధింపులు బరించలేక వారి నుండి దూరమై ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడానికి సంవత్సర కాలంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు దగ్గర అయ్యాను అన్నారు. డబ్బు మధంతో కోమటిరెడ్డి, భూపాల్ రెడ్డి రాజకీయాలు ఏలాగైనా శాసించవచ్చని కళలుగంటున్నారు. ఆ కళలు కలగానే మిగిలిపోతాయన్నారు. ప్రజాసేవకే అంకితం అవ్వడానికి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని ప్రకటించారు.



# మల్లారెడ్డికి బి.ఫామ్ ఇవ్వడంతో బిఆర్ఎస్ కార్యకర్తలు ఆనందోత్సాహం

**శామీర్ పేట్, విశాలభారతి:** మేడ్చల్ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో మల్లారెడ్డికి బీఫామ్ టికెట్ ఇవ్వడంతో బిఆర్ఎస్ కార్యకర్తలు ఆనందోత్సాహం లో బాణాసంచా పటాకులు కాల్చి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. మల్లారెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడిగా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని శామీర్ పేట్ మండల పార్టీ అధ్యక్షుడు విలాసాగరం సుదర్శన్ తన వార్డు మెంబర్లతో నాయకులతో కార్యకర్తలతో మల్లారెడ్డిన్ని గెలిపించటం కాయమని ధీమా వ్యక్తం చేశాడు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు నవీన్ శ్రీకాంత్ బాబు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# వెంబావి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం వెంబావి గ్రామంలో జాతీయ శ్రవణ, భాషణ దివ్యాంగుల సంస్థ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెంబావి గ్రామ సర్పంచ్ అద్దెల నర్సిరెడ్డి, తాళ్ల వెల్లంల సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి 40 మందికి వినికిడి సమస్య ఉన్నట్లు గుర్తించారు. వీరిని సికింద్రాబాద్ ఆస్పత్రికి రావాలని సూచించారు. ఫిజియోథెరపీ అవసరమైన వారికి ఇంటి వద్ద చేసుకునేలా పద్ధతుల గుర్చి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అద్దెల నర్సిరెడ్డి, తాళ్ళ వెల్లంల సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్, డా. కే శ్రీదేవి, డా. నరేష్, మండల వైద్యాధికారి కిరణ్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బీఫామ్ తో భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్,విశాలభారతి:** బీ ఫాం అందుకున్న తరువాత నేడు హైదరాబాద్ లోని అతి పురాతన దేవాలయం భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి మరియు వారి సతీమణి జయశ్రీ రెడ్డి ను వేద మంత్రాలతో ఆశీర్వదించిన వేద పండితులు.

# బీఆర్ఎస్ కు బిగ్ షాక్..

**తెలంగాణ మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజీనామా.**

**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ జిల్లాలో అధికార బీఆర్ఎస్ పార్టీ కి బిగ్ షాక్ తగిలింది. ఆపార్టీ మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత తెలంగాణ మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆకుల లలిత బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు సీఎం కేసీఆర్ కు తన నాలుగు పేజీల రాజీనామా లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆకుల లలిత కాంగ్రెస్ పార్టీలో ఎంపీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు లాంటి పదవులను నిర్వర్తించారు. 2018 లో అర్మూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటికే ఎమ్మెల్సీగా ఉన్న ఆకుల లలిత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆకుల లలితకు బీఆర్ఎస్ హయంలో ఎమ్మెల్సీ పదవిని కోనసాగించ లేదు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఇస్తారని ఆశగా ఎదురు



చూసిన నిరాశ తప్పలేదు.. ఈ ఏడాది తెలంగాణ మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆకుల లలిత నియ మించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కేటాయింపులో తనకు అర్బన్ స్థానం ఇవ్వాలని కోరారు. కానీ ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్ లకు టికెట్ లను ఇవ్వడంతో అప్పటి నుంచి ఆకుల లలిత టికెట్ కోసం ఇతర పార్టీలో చేరేందుకు ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా ఢిల్లీ స్థాయిలో జరిగిన చర్చల నేపథ్యంలో ఆకుల లలిత బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయ్యాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం పార్టీ సభ్యత్వానికి, తెలంగాణ మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేశారు. సీయం కేసీఆర్ కు ఆకుల లలిత నాలుగు పేజీల రాజీనామా లేఖస్రాన్ని సందించారు. తాను 23 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎమ్మెల్యేలకు అధికారం కట్టబెట్టి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఆకుల లలిత రాజీనామా లేఖ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. ఆకుల లలిత రేపోమాపో కాంగ్రెస్ పార్టీలో చేరిక ఖాయం అని సమాచారం. రాహుల్ గాంధీ నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఆకుల లలిత చేరిక అధికారికంగా వెలువరించే అవకాశం ఉంది.



## దుర్గం చిన్నయ్య మూడో సారి గెలవాలి

**బుగ్గ ఆలయంలో అర్చన, అభిషేకాలు**

**బెల్లంపల్లి, విశాలభారతి:** మంచిర్యాల జిల్లా కన్నాల గ్రామపంచాయతీ లోని బుగ్గరాజేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శ్రీదేవి శ్రీరాములు మరియు కన్నాల సర్పంచ్ జిల్లాపెల్లి స్వరూప వెంకట స్వామి ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండల సర్పంచ్ లు అందరూ కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మూడోసారి గెలవాలని అర్చన మరియు అభిషేకాలు ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి అశోక్ గౌడ్, మండల ఎంపీపీ గోమాస శ్రీనివాస్, అధికార ప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్, ఆకనపల్లి సర్పంచ్ పొట్లపల్లి ఉమాదేవి సుభాష్ రావు, బుచ్చయ్య పల్లి సర్పంచ్ పోలవేణి మాధవి శ్రీనివాస్, గురిజాల సర్పంచ్ గాజుల రంజిత వెంకటేష్ గౌడ్, బుధకలన్ సర్పంచ్ కోట లక్ష్మి అశోక్, సోమగూడెం సర్పంచ్ ప్రమీల చంద్రయ్య గౌడ్, బుధ కుర్దు సర్పంచ్ వేముల కృష్ణమూర్తి, లింగాపూర్ సర్పంచ్ కార్మోరి వెంకటేష్, దుగ్గిన పల్లి సర్పంచ్ డోలే సురేష్, లంబాడి తండ సర్పంచ్ గుర్రాల రాజమల్లు, అంకుశం సర్పంచ్ ఇండ్ల రాజమౌళి, పెరిక పల్లి సర్పంచ్ రామగోని పద్మావతి , చాకపల్లి సర్పంచ్ జంబి సురేష్, మరియు ఆలయ సిబ్బంది ఈవో బాబు రెడ్డి పాల్గొన్నారు

## వైయస్సార్ తెలంగాణ పార్టీ హుస్నాబాద్ టికెట్ కోసం కంది శ్రీనివాస్ దరఖాస్తు

- **హుస్నాబాద్ టికెట్ తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన శ్రీనివాస్**
- **పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన శ్రీనివాస్.**
- **ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినూత్న పద్ధతుల్లో నిరసనలు.**



**చిగురుమామిడి,విశాలభారతి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన వైఎస్సార్ తెలంగాణ పార్టీ మండల అధ్యక్షుడు కంది శ్రీనివాస్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గ నుండి పోటీ చేసేందుకు తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ హైదరాబాదులోని వైయస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో ఆదివారం దరఖాస్తు చేసుకున్నట్లు కంది శ్రీనివాస్ చెప్పారు. దరఖాస్తు అనంతరం అక్కడే ఉన్న మాజీ దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహానికి శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు.వైయస్సార్ ఆశ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీనివాస్ కోరారు.వైయస్సార్ తెలంగాణ పార్టీ స్థాపించినప్పటి నుండి పార్టీ అభివృద్ధితోపాటు,ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టిన తనకే హుస్నాబాద్ టికెట్ వస్తుందని కంది శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.వైఎస్ షర్మిల తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చేసిన పాదయాత్ర కార్యక్రమాల్లో కంది శ్రీనివాస్ చురుకుగా పాల్గొని శభాష్ అనిపించుకున్నారు. వైయస్సార్ తెలంగాణ పార్టీ లక్ష్యాలను, భవిష్యత్ కార్యాచరణను గడపగడపకు తీసుకెళ్లడంలో కంది శ్రీనివాస్ పెద్ద ఎత్తున కృషి చేశారు. వైయస్ షర్మిల ఆశీర్వాదంతో టికెట్ ఇస్తే గెలిచి వస్తానని కంది శ్రీనివాస్ స్పష్టం చేశారు.కంది శ్రీనివాస్ కు హుస్నాబాద్ టికెట్ కేటాయించాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కార్యకర్తలు నాయకులు కోరుతున్నారు.



## ఖేడ్ పట్టణ మున్సిపల్ కమిషనర్ ను బదిలీ చేయాలి

**నారాయణఖేడ్,విశాలభారతి:** నారాయణాఖేడ్ మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి ఘతం లో ఇక్కడ విధులు నిర్వహించి అధికార ప్రభుత్వంనికి తొత్తుగా వ్యవహరించి, అనేక అక్రమాలకు వసూళ్లకు పాల్పడడం జరిగింది, దీనితో జహీరాబాద్ మున్సిపల్ కి బదిలీ చేయడం జరిగింది, ఇతనిపై కోర్టు దిక్కర కేసు కూడా కలదు, ఎన్నికలు ఉన్నందున తిరిగి టిఆర్ఎస్ నాయకులు నారాయణఖేడ్ మున్సిపల్ కి బదిలీపై తీసుకురావడం జరిగింది ప్రస్తుతం ఇక్కడ టిఆర్ఎస్ పార్టీకి తొత్తుగా వివరిస్తాడు కనుక బదిలీ చేయగలరని నారాయణఖేడ్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాయర్ అలీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ నియోజకవర్గం ఎన్నికల అధికారి అందుబాటులో లేకపోవడంతో ఆర్డిఓ కార్యాలయంలోని ఏ ఆర్ ఐ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో నారాయణఖేడ్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నేహ్రూ నాయక్,నారాయణాఖేడ్ నియోజికవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు, నారాయణాఖేడ్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ కుమార్, మాజీ జడ్పీటీసీ చందర్ నాయక్, సర్దార్ నాయక్, వైజనాథ్, భూపాల్ కలరు



## మేనిఫెస్టోలో హామీల ఇంతకాలం ఎందుకు అమలు చేయలేదు

**సీపీఎం జిల్లాకార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**

**సూర్యాపేట,విశాలభారతి:** రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నిన్న ప్రకటించిన పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న వాగ్దానాలను అధికారంలో ఉండి ఇన్ని రోజులుఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసిఆర్ ప్రకటించిన వాగ్దానాలు నేటి వరకు ఎందుకు అమలు చేయలేదుఅని ప్రశ్నించారు. కెసిఆర్ తాను ప్రకటించిన హామీలను నేటికీ 10 సంవత్సరాలు అవుతున్న అమలు చేయలేదన్నారు. గత వాగ్దానాలని అమలు చేయని కెసిఆర్ కొత్త హామీలను అమలు చేస్తామంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. దళిత గిరిజనులకు మూడు ఎకరాల సాగు భూమి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పన, అర్హులైన పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, పేదలకు గృహలక్ష్మి ఇండ్లు, కేజీ టు పీజీ ఉచిత విద్య, గిరిజనులందరికీ పోడు భూమికి పట్టాలు, నిరుద్యోగ యువతకుని రుద్యోగ భృతి, 57 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్, గొర్రెల మేకల పెంపకం దారులకు గొర్రెల పంపిణీ, బిసి రుణాలు, మైనార్టీ రుణాలు, పూర్తిస్థాయిలో రైతుల రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళిత ముఖ్యమంత్రి, రైతాంగానికి ఉచితంగా ఎరువుల పంపిణీ, రైతులకు పంట నష్టపరిహారం, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు వంటి హామీలను నేటికీ అమలు చేసిన పాపానా పోలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని బి ఆర్ఎస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారో సమాధానం చెప్పాలన్నారు. 10 సంవత్సరాలుగా ప్రభుత్వ పథకాల కోసం ఒంటె పెదాలకు నక్క ఆశపడ్డ చందంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు కెసిఆర్ ఇచ్చిన హామీల అమలు కోసం ఇన్ని సంవత్సరాలు ఎదురు చూసి మోసపోయారనిఅన్నారు. ఎమ్మెల్యేలకు జీతాలు పెంచిన ప్రభుత్వం ఉద్యోగకు మాత్రం ఐఆర్ ఇవ్వడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బి ఆర్ ఎస్ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదు అన్నారు.



## మంత్రి వేములను పరామర్శించిన మంత్రి పట్నం మహేందర్ రెడ్డి

**బాల్కొండ,విశాలభారతి:** రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ లోని మంత్రి వేముల నివాసంలో రాష్ట్ర గనులు, భూగర్భవనరులు సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి,రాష్ట్ర సాహిత్య అకాడెమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, తదితరులు,బంధు మిత్రులు,శ్రేయోభి లాషులు పరామర్శించారు.ఈ సంద ర్భంగా మంజులమ్మ చిత్రపటానికి వారు పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంత్రికి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## బాల్కొండ నియోజకవర్గంలో 3 లక్షల 50 వేలు సీజ్

**బాల్కొండ,విశాలభారతి:** అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్,వేల్పూర్ మండలం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా మోర్తాడ్ మండలం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఓ కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.2లక్షల 50వేల నగదును మోర్తాడ్ పోలీస్ సిబ్బంది సీజ్ చేశారు.అలాగే వేల్పూర్ మండలం పడిగల్ X రోడ్డ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా జగిత్యాల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1లక్ష నగదును వేల్పూర్ పోలీసులు పంచ నామా




చేసి సీజ్ చేశారు. కార్యక్రమంలో మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి,వేల్పూర్ ఎస్సై వినయ్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి

- **క్రీడా స్ఫూర్తిని విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**
- **నర్మాల గురుకులంలో ఘనంగా తొమ్మిదవ జోనల్ స్పోర్ట్స్ ముగింపు వేడుకలు**

**ముస్తాబాద్,విశాలభారతి:** విద్యతో పాటు విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు మానసిక, శారీరక దారుఢ్యంకు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 9వ జోనల్ మీట్ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగు రోజులుగా గురుకులాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. వారికి జిల్లా కలెక్టర్ బహుమతులను ప్రధానం చేశారు. జోనల్ పరిధిలోని 13 పాఠశాలలు చెందిన 1105 మంది విద్యార్థులు జోనల్ మీటిలో భాగస్వాములయ్యారు.కబడ్డీ కోకో వాలీబాల్ అథ్లెటిక్స్ వంటి పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. అండర్ 19, అండర్ 17, అండర్ విభాగాలలో విజేతలకు కలెక్టర్ అనురాగ్ జయంతి మెడల్స్ బహూకరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ విద్యతోపాటు క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడుతాయని విద్యార్థినిలకు క్రీడా స్ఫూర్తితో ముందుకు కొనసాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గురుకులాల ఉప కార్యదర్శి శ్రీనివాస్,
ఆర్ సి ఓ మేరీ ఏసు పాదం,
డి సి ఓ జాక్విలిన్, ప్రిన్సిపాల్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

**పోటీలలో విజేతలుగా నిలిచిన వారి వివరాలు**

1.ఓవరల్ ఛాంపియన్షిప్ ఫర్ అథ్లెటిక్స్
U14 మెదక్
2.ఓవరాల్ ఛాంపియన్షిప్ ఫర్ అథ్లెటిక్స్
U17 చిన్న బోనాల
3.ఓవరాల్ ఛాంపియన్షిప్ ఫర్ అథ్లెటిక్స్
U19 నర్మాల
4.ఓవరాల్ ఛాంపియన్షిప్ ఫర్ గేమ్స్
U 14 రామాయంపేట ,U 17 చొప్పదండి ,
U. 19 చింతకుంట
5.ఓవరాల్ ఛాంపియన్షిప్ ఫర్ అథ్లెటిక్స్ & గేమ్స్
U 14నర్మాల , U 17 చిన్నబోనాల , U 19 నర్మాల





## నియోజకవర్గ అభివృద్ధి శూన్యం

- **కాంగ్రెస్ మేనిఫెస్టో కాపీ కొట్టిన బిఆర్ఎస్**
- **ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి**
- **ఎఐసిసి కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి**

**విశాల భారతి అమనగల్లు :** బిఆర్ఎస్ అవినీతి, అరాచక పాలనకు ప్రజలు ఈ ఎన్నికల్లో చరమగీతం పాడబోతున్నారని, ప్రజాస్వామ్య పరిపాలన కాంగ్రెస్తోనే సాధ్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. సోమవారం ఆమనగల్లు మండల పరిధిలోని మాలెపల్లి, పోలేపల్లి గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పథకాల పేరిట మోసం చేస్తున్నాడని, కసిరెడ్డి నారాయణ రెడ్డి వంశీచంద్ రెడ్డి లు గడప గడపకు వెళ్లి ప్రజలను పలకరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. రాబోయ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెసు బ్రహ్మరథం పట్టబోతున్నారని. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కాంగ్రెస్ కాపీ కోటిందని ఎద్దేవా చేశారు. మాజీ జెడ్పిటిసి సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మనాయ్య, రమణారెడ్డి, కృష్ణ నాయక్, వస్పూల శ్రీశైలం, శ్రీకాంత్, ఫరీద్, అవ్వారి శివలింగం, గాజుల శీను, విజయ్ రాథోడ్,నాజర్, సురేష్ ,రవి తిరుపతి, మహేష్ తదితరులు, పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

**సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం**



**సైదాపూర్,విశాలభారతి:** మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన రైతు పిన్ రెడ్డి రాంరెడ్డి (50) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. రాంరెడ్డి, అతని కొడుకు సందీప్ రెడ్డి తండ్రి కొడుకులు కలసి వ్యవసాయ పని నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటలకు పొలానికి నీళ్లు పెట్టి వస్తామని చెప్పి వెళ్లారు. మధ్యాహ్నం 12:00 సమయంలో తన కొడుకు సందీప్ రెడ్డి ఫోన్ చేసి నాన్న కనిపిస్తే లేదని ఫోన్ ద్వారా తెలుపగా భార్య పద్మ బావి కాడికి వెళ్లి చూడగా కరెంట్ పోల్ స్తంభానికి పక్కకు చెప్పులు విడిచి ఉండడంతో అనుమానం వచ్చి బావిలో చూడగా శవమై కనిపించాడు మృతుడు రాంరెడ్డి బావిలో నీరు అడుగంటడంతో మోటర్ ను బావిలోకి దింపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు గారి బావిలో పడగా తలకు తీవ్రమైన గాయాలు కావడంతో రక్త స్రావమై చనిపోయాడని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

విశాల భారతి

# సినిమా



## సైంధవ్' ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్స్‌ని ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు

విక్టరీ వెంకటేష్ పాన్ ఇండియా చిత్రం 'సైంధవ్' మేకర్స్ ఈ రోజు టీజర్‌ను లాంచ్ చేయడం ద్వారా ప్రమోషన్స్ ప్రారంభించారు. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలోని అన్ని ప్రధాన పాత్రలని ఇంతకుముందు రివిల్ చేశారు. టీజర్‌లో సినిమాలోని రెండు విభిన్న కోణాలు కనిపిస్తున్నాయి. ఇది ఫ్యామిలీ డ్రామాగా ప్రారంభమైనప్పటికీ, హీరో కారణంగా పూర్తికాని పెద్ద అసైన్‌మెంట్‌ను తీసుకునే భయంకరమైన విలన్‌గా నవాజుద్దీన్ సిద్ధిఖీని పరిచయం చేయడంతో సినిమా కోర్ పాయింట్ ఆసక్తికరంగా ప్రజెంట్ చేసారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ తన పనిని నెరవేర్చుకోవడానికి ఎంతకైనా తెగించే క్రూరమైన విలన్ గా కనిపించాడు. అతను చిన్న పిల్లలను ఎంపిక చేసుకొని, వారికి శిక్షణ ఇచ్చి, తన సంఘ వ్యతిరేక పని కోసం వారిని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తాడు. అతను వెంకటేష్‌ను సైకో (SaiKo) అని పిలవడం హీరో హింసాత్మక స్వభావాన్ని సూచిస్తుంది. వెంకటేష్ ప్రారంభ భాగాలలో ప్రశాంతంగా, భావోద్వేగంగా కనిపిస్తారు. చివర్లో తన ఫెరోసియస్ యాక్ట్ ని చూపుతారు. ప్రత్యర్థులకు వార్నింగ్ తీరు టెర్రిఫిక్ గా వుంది. దర్శకుడు శైలేష్ కొలను క్రైమ్ థ్రిల్లింగ్ సబ్జెక్ట్‌లను హ్యాండిల్ చేయడంలో తన సత్తాను నిరూపించుకున్నాడు. ఇది నెక్స్ట్ లెవల్ సబ్జెక్ట్. సైంధవ ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్తు రూపొందించిన ప్రతి ఫ్రేమ్‌లోనూ అతని విజన్ కనిపిస్తుంది. ఎస్. మణికందన్ అద్భుతమైన విజువల్స్ అందించారు, విజువల్ వండర్ ని క్రియేట్ చేశారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ ప్రతి మూమెంట్ తన స్కోర్ తో మరింతగా ఎలివేట్ చేశాడు. గ్యారీ బిహెచ్ పదునైన ఎడిటింగ్ తో పాటు అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ మెయిన్ ఎసెట్ లో ఒకటిగా నిలిచింది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా నిర్మాణ విలువలు ఆద్యంతం గ్రాండ్‌గా ఉన్నాయి. టీజర్ ఆసక్తికరమైన సెటప్, గ్రిప్పింగ్ కథనం, అసాధారణమైన పెర్ ఫార్మెన్స్, సాంకేతిక నైపుణ్యంతో అందరినీ కట్టిపడేసింది. టీజర్ లాంచ్ ఈవెంట్ లో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. నా మొదటి సినిమా నుంచి ఇప్పుడు 75వ సినిమా సైంధవ్ వరకూ నన్ను ఎంతగానో ప్రేమించి ఆదరించి అభిమానిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీరు నన్ను ఎంత ప్రోత్సహించారో నాకు తెలుసు. మీ ప్రేమ అభిమానం ఆప్యాయత వలనే ఈ ప్రయాణం సాధ్యపడింది. ఈ సందర్భంగా ప్రేక్షకులకు, అభిమానులకు, చిత్ర పరిశ్రమకు, మీడియాకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. సైంధవ్ టీం అందరికీ థాంక్స్. ఒక ప్రత్యేకమైన కథ కోసం ఎదురుచూస్తున్నపుడు దర్శకుడు శైలేష్ సైంధవ్ కథ చెప్పారు. బలమైన ఎమోషన్, యాక్షన్ కి స్కోప్ వున్న కథ ఇది. వెంటనే ఓకే చెప్పాను. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది. ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ నచ్చుతుంది. ఇందులో కొత్త వెంకీని చూస్తారు. వెంకట్ ప్యాసినేట్ ప్రొడ్యూసర్. అందరికీ నచ్చే మంచి సినిమా తీయాలనే తపన ఆయనలో వుంటుంది. పండగ రోజు తప్పకుండా ఒక మంచి సినిమా ప్రేక్షకుల చూడబోతున్నారు'' అన్నారు.



## సాయి పల్లవి ఆనందం ఆత్రుత..!

ఫిదా చిత్రంతో తెలుగు ప్రేక్షకులను ఫిదా చేసిన ముద్దుగుమ్మ సాయి పల్లవి టాలీవుడ్ తో పాటు కోలీవుడ్ ఇతర భాషల్లో కూడా మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. సాయి పల్లవి ఈ మధ్యకాలంలో కాస్త సినిమాల ఎంపిక విషయంలో అ శ్రద్ధ చూపిస్తుందంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన మంచి ఆఫర్స్ చేజేతులా వదులుకొని చిన్న చితక సినిమాల్లో నటిస్తోంది అంటూ కొందరు ఈమెని ట్రోల్ చేస్తున్నారు. ఎట్టకేలకు ఈమె మళ్లీ సౌత్ తో పాటు ఇతర భాషల్లో బిజీ అయ్యేందుకు సినిమాలు కమిట్ అయింది. ముందు ముందు మరిన్ని సినిమాలతో సాయి పల్లవి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇక దేశం మొత్తం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న రామాయణం సినిమాలో సీత పాత్రకి సాయి పల్లవి ఎంపిక అయింది. ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి దర్శకత్వంలో భారీ బడ్జెట్ తో రూపొందబోతున్న రామాయణం సినిమా కాస్టింగ్ ఎంపిక జరుగుతుంది. అందులో భాగంగా దర్శకుడు ఇటీవల సాయి పల్లవిని సంప్రదించాడని.. త్వరలోనే కథ చెప్పబోతున్నాడని వార్తలు వస్తున్నాయి. ఆ ప్రాజెక్టు విషయం సాయి పల్లవి తాజాగా క్లారిటీ ఇచ్చింది. దర్శకుడు నితీష్ తివారి తనకు ఈ ఛాన్స్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.. సీత పాత్రను ఇప్పటి వరకు ఎంతో మంది గొప్ప హీరోయిన్స్ పోషించారు. వారు కనబరిచిన నటనలో తాను పది శాతం కనబరిచిన కూడా విజయం సాధించినట్లే. కనుక తాను ఆ 10 శాతం నటనను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాను అన్నట్లుగా సాయి పల్లవి చెప్పుకొచ్చింది. హీరోయిన్గా సాయి పల్లవి ఇప్పుడు వరకు భిన్నమైన పాత్రలో కనిపించింది అయితే సీత పాత్ర అనేది కచ్చితంగా మనకు ఒక ఛాలెంజింగ్ రోల్.. అంతే కాకుండా ఆమె స్థాయిని చూపించగల సినిమా అవుతుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాయి పల్లవి రామాయణం సినిమాలో ఛాన్స్ రావడం పట్ల చాలా ఆనందంతో కనిపిస్తోంది. అంతే కాకుండా ఏప్పుడప్పుడు సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుందా అంటూ ఆత్రుతగా ఎదురు చూస్తోంది. రామాయణం సినిమా రావడానికి మరో రెండు మూడు సంవత్సరాలు పట్టే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్పటి వరకు సాయి పల్లవి ఫ్యాన్స్ కాస్త ఓపిక పట్టాల్సిందే ,

## సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా



వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ ఈరోజు తన కొత్త సినిమాని అనౌన్స్ చేశారు. దర్శక, నిర్మాతలకు ఇది చాలా ప్రత్యేకమైన సినిమా కానుంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా అరంగేట్రం చేస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ఇది 30వ చిత్రం కానుంది. భారీ బడ్జెట్‌తో టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ చిత్రానికి 'తెలుసు కదా' అని పేరు పెట్టారు. ఈ చిత్రం పూర్తి విందు భోజనం అందించబోతుందని అనౌన్స్ మెంట్ వీడియో సూచిస్తోంది. విజువల్స్ గ్రాండ్‌గా వున్నాయి, టాప్ క్లాస్ ప్రొడక్షన్, సాంకేతిక ప్రమాణాలతో అనౌన్స్ మెంట్ కాన్సప్ట్ యూనిక్ గా వుంది. సోల్‌ఫుల్ లవ్ స్టోరీగా రూపొందనున్న ఈ సినిమా సిద్ధుని కొత్త అవతార్‌లో ప్రెజెంట్ చేస్తుంది. ఇందులో అందమైన భావోద్వేగాలతో పాటు సోషల్ ఎలిమెంట్స్, రిలేషన్స్ వుంటాయి. ఒక అబ్బాయి, అమ్మాయి కథతో పాటు స్నేహం, కుటుంబం, త్యాగం, సెల్ఫ్ లవ్ కి సంబధించిన కథ ఇది.

## టైగర్ నాగేశ్వరరావు' యాక్షన్, ఎమోషన్, థ్రిల్ నిస్తుంది



: మాస్ మహారాజా రవితేజ

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు వంశీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్‌ల క్రేజీ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో మయాంక్ సింఘానియా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్స్. గ్రిప్పింగ్ టీజర్, మ్యాసివ్ ట్రైలర్, చార్ట్‌బస్టర్ పాటలతో టైగర్ ఇప్పటికే నేషనల్ వైడ్ గా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తుంది. అక్టోబర్ 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ ని నిర్వహించింది. కేంద్రమంత్రి నంద్ గోపాల్ గుప్తా, ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్, దర్శకులు హరీష్ శంకర్, మలినేని గోపీచంద్, బివీఎస్ రవి, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, నవీన్ యర్నేని, వివేక్, సుధాకర్ చెరుకూరి, మిర్యాల రవీందర్, నాగవంశీ పాల్గొన్న ఈ ఈవెంట్ వేడుకగా జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. మా గురువు గారు విజయేంద్రప్రసాద్ గారికి, కేంద్రమంత్రి నంద్ గోపాల్ గుప్తా గారికి, ఈ వేడుకు విచ్చేసిన నా తమ్ముళ్ళు లాంటి దర్శకులు హరీష్, రవి, గోపికి, నిర్మాతలకు, నా అభిమానులకు ధన్యవాదాలు. ఈ సినిమా ప్రతి బ్లాక్ అద్భుతంగా వచ్చిందంటే దానికి కారణం మా డీవోపీ మధి. మా యాక్షన్ కొరియోగ్రఫర్స్ పీటర్ హెయిన్స్, రామ్ లక్ష్మణ్ చాలా బ్రిలియంట్ యాక్షన్ ని డిజైన్ చేశారు. రియల్ లోకేషన్స్ రియల్ యాక్షన్. ఈ సినిమా యాక్షన్ ఎమోషన్ ఇంత రియల్ గా రావడానికి మరో కారణం రామ్ లక్ష్మణ్ కూడా ఆ ప్రాంతం వారే. టైగర్ గురించి బాగా తెలిసిన వాళ్ళు. వంశీ ఈ కథ చెప్పినపుడు చాలా ఎక్సయిట్ అయ్యాను. ఈ సినిమా మిమ్మల్ని గట్టిగా అలరిస్తుందని నమ్ముతున్నాను. రేణు దేశాయ్ గారు చాలా రోజుల తర్వాత కమ్ బ్యాక్ ఇచ్చారు. చాలా అద్భుతంగా ఆ పాత్రకు మ్యాచ్ చేశారు. శ్రీకాంత్ విస్సా అద్భుతమైన డైలాగ్స్ రాశాడు. చాలా ఎంజాయ్ చేస్తారు. ఎమోషన్ ఫీల్ అవుతారు. అనుకృతి కీలకమైన పాత్ర చేసింది. నూపూర్, గాయత్రి బ్యూటీఫుల్ హీరోయిన్స్. క్యారెక్టర్స్ చాలా బాగా చేశారు. అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీపడకుండా తీశారు. సినిమా చాలా భారీ వుంటుంది. ఈ సినిమాతో హ్యాట్రిక్ కొట్టాలి. తనతో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. జీవి ప్రకాష్ మ్యూజిక్ కి చాలా థ్రిల్ ఫీలౌతారు. సౌండ్ థియేటర్ లో ఎలా వుంటుందో చూడటానికి ఎదురుచూస్తున్నా. వంశీ నుంచి ఇలాంటి కన్విక్సన్ నేను ఊహించలేదు. అంత అద్భుతంగా చేశాడు. అది ప్రేక్షకులు కూడా చూస్తారు. వంశీ గురించి రిలీజ్ తర్వాత గట్టిగా మాట్లాడతా. ఈ సినిమా అక్టోబర్ 20న మీ అందరినీ అలరించడానికి వస్తుంది. ఎమోషన్.. థ్రిల్..యాక్షన్ అన్ని ఎమోషన్స్ ఇందులో వున్నాయి. అలాగే మా బాలయ్య బాబు సినిమా భగవంత్ కేసరి కూడా విడుదలౌతుంది. అలాగే విజయ్ సినిమా కూడా వస్తుంది.. అన్నీ సినిమాలు సూపర్ హిట్లు కావాలని కోరుకుంటున్నాను. అందరికీ ధన్యవాదాలు" తెలిపారు.



## ఓంకార్ హారర్ థ్రిల్లర్ "మాన్షన్ 24" ప్రీ రిలీజ్




రాజు గారి గది సిరీస్ సినిమాలతో ప్రేక్షకుల్ని హారర్ కామెడీతో ఆకట్టుకున్న దర్శకుడు ఓంకార్ ఈసారి మాన్షన్ 24 అనే సరికొత్త హారర్ వెబ్ సిరీస్ తో రాబోతున్నారు. హాట్ స్టార్స్ స్పెషల్స్ గా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఈ వెబ్ సిరీస్ రేపటి నుంచి స్ట్రీమింగ్ కానుంది. మాన్షన్ 24లో సత్యరాజ్, వరలక్ష్మి శరత్ కుమార్, అవికా గోర్, బిందు మాధవి, నందు, మానస్, అయ్యప్ప పి.శర్మ, రావు రమేష్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మాన్షన్ 24 ప్రీ రిలీజ్ కార్యక్రమం ఇవాళ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ వికాస్ బాడిస మాట్లాడుతూ మాన్షన్ 24 వెబ్ సిరీస్ కు పనిచేసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ ఓంకార్ గారికి థ్యాంక్స్. డిఫరెంట్ జానర్స్ ఉన్న సిరీస్ ఇది. హారర్ కామెడీ, థ్రిల్లర్, క్లాసికల్, వెస్ట్రన్ ఇలా అన్ని జానర్స్ కలిపి ఒక ప్యాకేజ్ లా రూపొందించారు. దీంతో నాకు వైవిధ్యమైన మ్యూజిక్ చేసే అవకాశం దక్కింది. అన్నారు. దర్శకుడు ఓంకార్ మాట్లాడుతూ ఇన్ కేబుల్ అనే చిన్న కేబుల్ టీవీ నుంచి నా కెరీర్ ప్రారంభమైంది. అప్పటి నుంచి మాన్షన్ 24 సిరీస్ తెరకెక్కించే వరకు మీడియా, ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్, ప్రేక్షకులు నాకు సపోర్ట్ గా ఉన్నారు. నేను చేసే ప్రతి ప్రాజెక్ట్ ను ఆదరిస్తూ వచ్చారు. అందుకు మీ అందరికీ నా థ్యాంక్స్. నేను రూపొందించిన ఫస్ట్ వెబ్ సిరీస్ ఇది. మాన్షన్ 24 ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇవాళ రాత్రి నుంచే డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ స్టార్ట్ అవుతుంది. మీరు మీ ఫ్యామిలీ అందరితో కలిసి చూస్తూ ఎంజాయ్ చేసే మంచి వెబ్ సిరీస్ అవుతుంది. ఇది నా ఒక్కడి క్రెడిట్ కాదు. మా ఆర్ట్ డైరెక్టర్, డీవోపీ, మ్యూజిక్ డైరెక్టర్, ఆర్టిస్టులు ఇలా టీమ్ అంతా కష్టపడి మంచి ప్రాడక్ట్ తీసుకొచ్చారు. అన్నారు.

## జాన్వీకపూర్ పై ట్రోలింగ్

నీతా అంబానీకి చెందిన కల్చరల్ సెంటర్ లో తారల హంస నడకలతో ముంబై షేకైంది. బాలీవుడ్ టాప్ హీరోయిన్స్ వేదికను హీటెక్కించారు. ఇక శ్రీదేవి నటవారసురాలు జాన్వీ కపూర్ ఎల్ఎఫ్‌డబ్ల్యూ ర్యాంప్‌పై నడుస్తున్నప్పుడు బాడీ హగ్గింగ్ స్కర్ట్ - స్ట్రాప్‌లెస్ బ్లౌజ్‌లో ఆకర్షణీయంగా కనిపించింది. అయితే సోషల్ మీడియాలో కపూర్ గాళ్ లుక్, నడక పరంగా మరోసారి షో స్టాపర్ గా నిలిచింది. Also Read - 'బొబ్బిలి రాజా' సీక్వెల్ కి రెడీగా ఉన్న వెంకీ ప్రస్తుత తరం నటీమణుల్లో జాన్వీ కపూర్ అతిపెద్ద ఫ్యాషనిస్టా. జిమ్‌లో, ఎయిర్‌పోర్ట్ లుక్స్‌లో, ఈవెంట్‌లు లేదా ర్యాంప్‌లలో శ్రీదేవి కుమార్తె తరచుగా తన సార్టోరియల్ ఎంపికలతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. కానీ ఇటీవల డిజైనర్ అమిత్ అగర్వాల్ సారథ్యంలో లాక్మేవీక్ లో ర్యాంప్‌పై నడిచింది. అందరి కళ్ళు ఆమెపైనే ఉండేలా చూసుకుంది. ఎంపిక చేసిన బాడీ హగ్గింగ్ స్కర్ట్ - స్ట్రాప్‌లెస్ బ్లౌజ్‌లో ఆకర్షణీయంగా కనిపించింది. ర్యాంప్ చుట్టూ ప్రేక్షకులు జాన్వీకపూర్ హంస నడకలకు బోల్తా పడ్డారని చెప్పాలి. అయితే సోషల్ మీడియాలో ఒక సెక్షన్ ని మాత్రం జాన్వీ లుక్, నడక మెప్పించకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. జాన్వీ ఈ బాడీ హగ్గింగ్ దుస్తులలో నడవలేనట్లు కనిపిస్తోంది! అని ఒక నెటిజన్ రాశారు. దయచేసి ఆమెను లెజెండరీ శ్రీ దేవితో ఎప్పుడూ పోల్చవద్దు అని ఒకరు కామెంట్ చేసారు. నువ్వు దారితప్పిన దానిలా నడుస్తావు! అని ఒకరు కామెంట్ చేయగా, ఆమె గిగి హడిద్ (ఆ హెయిర్ ఫ్లిప్)ని కాపీ చేయడానికి ప్రయత్నిస్తోందని ఒక సోషల్ మీడియా యూజర్ అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనప్పటికీ, జాన్వీకి ఆమె అభిమానులు, అనుచరులు, పరిశ్రమ వ్యక్తుల నుండి లభించే ప్రేమ ప్రశంసల ముందు నెటిజన్‌లలోని ఒక నిర్దిష్ట విభాగం వెదజల్లుతున్న ద్వేషం చాలా తక్కువ. ధడక్ తర్వాత బాలీవుడ్ లో కెరీర్ పరంగా చాలా దూరం వచ్చింది జాన్వీ. ఇప్పుడు టాలీవుడ్ లోను అడుగుపెడుతోంది. దేవర చిత్రంలో ఎన్టీఆర్ సరసన నటిస్తోంది. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కనుంది. నటిగానే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు, ప్రకటనల ఆదాయంలోను జాన్వీని నేటితరంలో కొట్టేవాళ్లే లేరు. జాన్వీ ఇప్పటికే పరిశ్రమలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుంది.

## 'వాట్ ది ఫిష్' నుంచి వెన్నెల కిశోర్ క్రేజీ ఫస్ట్ లుక్



రాకింగ్ స్టార్ మంచు మనోజ్ క్రేజీ ప్రాజెక్ట్ 'వాట్ ది ఫిష్' తో కమ్ బ్యాక్ ఇస్తున్నారు. నూతన దర్శకుడు వరుణ్ కోరుకొండ దర్శకత్వంతో పాటు ఈ చిత్రానికి కథ , స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. 'మనం మనం బరంపురం' అనేది సినిమా ట్యాగ్ లైన్. 'వాట్ ది ఫిష్' హై ప్రొడక్షన్ వాల్యూస్, అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో రూపొందుతోంది. పాన్‌ఇండియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రాన్ని 6ix సినిమాస్ విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ నిర్మిస్తున్నారు. మనోజ్ ని విభిన్న గెటప్‌లలో ప్రజెంట్ చేస్తూ ఇదివరకే విడుదలైన ఫస్ట్ లుక్ గ్లింప్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న వెన్నెల కిశోర్ ఫస్ట్ లుక్ ని విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ లో సీరియస్ లుక్ లో చేతిలో ఓ పెద్ద రంపంతో చాలా క్రేజీ గా కనిపించారు. బ్యాగ్ గ్రౌండ్ లో కరెన్సీ నోట్లు గాల్లో ఎగరడం కూడా గమనించవచ్చు. ఇందులో వెన్నెల కిశోర్ పాత్ర చాలా క్రేజీ గా ఉంటుందని ఫస్ట్ లుక్ చూస్తే అర్థమౌతుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.